అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి
1
శనివారం 28 జనవరి 2023

నిరుపేద కుటుంబాలకు అండగా జై భీమ్ ఫౌండేషన్

నవతెలంగాణ-చింతలపాలెం

నిరుపేద కుటుంబాలకు జై భీమ్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా వుంటుందని ఆ ఫౌండేషన్ అధ్యక్షులు డెక్కం గోపయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలపరిధిలోని దొండపాడు గ్రామానికి చెందిన కత్తుల దానమ్మకు ఇటీవల కాలంలో ఆపరేషన్ జరిగిందన్నారు.ఇదివరకే భర్తను కోల్పోయి ఉండి కుటుంబ పోషణ లేక ఇబ్బందిగా ఉండి జై భీమ్ ఫౌండేషన్ సభ్యులను సంప్రదించగా ఫౌండేషన్ సభ్యులు ఆమె కుటుంబానికి 25 కేజీల బియ్యం అందించడంతో పాటు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రుద్రపంగు రమేష్, ఫౌండేషన్ సభ్యులు సత్యం, గోవిందు, లోకేష్, పాపారావు, కోటయ్య, చిన్న వెంకటేశ్వర్లు, ముత్తయ్య, రాజు, కరుణాకర్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో నేటి నుంచి రథసప్తమి వేడుకలు

నవతెలంగాణ-అర్వపల్లి

తిమ్మాపురంలోని సూర్యక్షేత్రంలో నేటి నుంచి రథసప్తమి వేడుకలను వైభవంగా జరగనున్నాయి.మహాబలిపురంలో ప్రత్యేకంగా తయారు చేయించిన చిత్రాన్ని ఈ సందర్భంగా ప్రారంభించడం జరుగుతుంది.ఉషా పద్మనీచాయ సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం,ప్రత్యేకపూజలు, స్వామి పాదాలకు సూర్యకిరణాలు ప్రసరించడం జరుగుతుంది.అలాగే క్షేత్రంలో అభిషేకాలు, అన్నదానం, ప్రత్యేకపూజలు జరుగుతాయి.ఈ ఉత్సవానికి మంత్రి జగదీశ్‌రెడ్డి,ఎమ్మెల్యే కిషోర్‌కుమార్,జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావు హాజరవుతున్నారు.ఉత్సవాల సందర్భంగా సూర్యాక్షేత్రాన్ని బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన పూలతో అలంకరించారు.

28 నుండి చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు

- ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలు
- మంత్రి జగదీశ్‌రెడ్డికి, ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్‌లకు ఆహ్వానపత్రికను అందజేసిన ఆలయ అధికారులు

నవతెలంగాణ-సూర్యాపేట

కొలిచిన వారికి కొంగు బంగారమై, పిలిచిన వారికి చల్లని దైవంగా, అనారోగ్యాలను పారదోలి ఆయురారోగ్యాలు ప్రసాదించే స్వామిగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో కొలువై ఉన్న చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు జరుగనున్నాయి.ఈమేరకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌లకు ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వాన పత్రికను అందజేశారు.బ్రహ్మోత్సవాలకు సుమారు 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా ఉండడంతో మంత్రి ఆదేశాల మేరకు ఇప్పటికే భక్తులకు సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వం తరపున ఈ నెల 29 వ తేదీన స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మంత్రి జగదీశ్‌రెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందజేస్తారు.

జాతర లో ముఖ్య ఘట్టాలు....

ఈ నెల 28న ఉదయం 10 గంటలకు బ్రహ్మోత్సవాలు



ప్రారంభమవుతాయి.29 వ తేదీ తెల్లవారు జామున స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.30న అగ్నిగుండాలు, 31న దోపోత్సవం, అశ్వవాహన సేవ జరుపుతారు. ఫిబ్రవరి1 రాత్రి పుష్పోత్సవం, ఏకాంత సేవలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 2న సాయంత్రం 4 గంటలకు గజవాహనంపై చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం బ్రహ్మోత్సవాలుర్ పరిపూర్ణం అవుతాయి.

కంటివెలుగు శిబిరాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-వేములపల్లి

మండలకేంద్రంలో చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటిపరీక్షల కోసం వస్తున్న వారికి కంటిపరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు.అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందివ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధన శశిధర్‌రెడ్డి, ఎంపీటీసీ చైతన్య, డాక్టర్ సుచరిత, డీఈఓ దివ్యభారతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



పత్తికి మద్దతు ధర12 వేలు ఇవ్వాలి



- సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల

నవతెలంగాణ- కేతపల్లి

పత్తికి మద్దతు ధర తింటావు రూ.12వేలు ఇవ్వాలని సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు డిమాండ్ చేశారు.శుక్రవారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల సభ్యత్వం క్యాంపెను ప్రారంభించి మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర లేకపోవడంతో రైతులు నెలలకొద్ది పత్తిని నిల్వ చేసుకోలేక, అటు అమ్ముకో లేక నానా ఇబ్బందుల పాలు అవుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పాటుపడుతున్నామని పదేపదే ప్రగాల్భాలు చెప్పడం తప్ప చేసింది శూన్యమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి లూర్దు మారయ్య జిల్లా నాయకులు వీరబోయిన సౌడయ్య, ప ల్లయ్య, రాధిక, మనేమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

మన జీవితం మన చేతుల్లోనే

- న్యాక్ గుర్తింపునకు సమిష్టిగా కృషి
- బీఆర్ఏఓయూ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ధర్మానాయక్

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

సమస్యలు అనేకం అవి తీరాలంటే కేవలం చదువు ఒకటే మార్గం.. ఎవరి జీవితం వారి చేతుల్లోనే ఉంటుందని. విద్యార్థులంతా ఉన్నత చదువులు చదివి పదిమందికి ఆదర్శంగా నిలవాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ధర్మనాయక్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం బీఆర్ఏఓయూ రీజినల్ కోఆర్డినేటర్ సెంటర్ హాల్లో న్యాక్ పై విద్యార్థిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఏర్పాటు



చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవితంలో కొత్త వెలుగునిచ్చేది.. బాధలను దూరం చేసేది కేవలం చదువు ఒకటే అన్నారు. చదువును మధ్యలో ఆపివేసి, ఉద్యోగాలు చేస్తూ చదువుకోలేని వారి కోసం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చదువును కొనసాగించే వీలును కల్పించిందన్నారు. స్టడీ సెంటర్ లో చదివిన అనేక మంది విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ లో టాపర్లుగా నిలిచారన్నారు. బి ఆర్ఏఓయు విసి సీతారాం ఆధ్వర్యంలో మొదటిసారిగా న్యాక్ గుర్తింపుకు వెళుతున్నామని అధ్యాపకులు, విద్యార్థులు అందుకు సహకారం అందిస్తూ బిఆర్ఏఓయు కు (ఏ ప్లస్ ప్లస్) గ్రేట్ వచ్చేలా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ మెయిల్ ఐడిని చెక్ చేసుకుని రిప్లై ఇవ్వాలని తెలిపారు. దేశ, విదేశాలలో న్యాక్ కు ప్రత్యేక గుర్తింపు ఉందని, న్యాక్ వల్ల యూనివర్సిటీకి నిధులు వస్తాయని దీంతో కోఆర్డినేటర్ సెంటర్ల అభివృద్ధి, విద్యార్థులకు కావలసిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ లభిస్తాయని, అంతేకాకుండా న్యాక్ గుర్తింపు పొందిన యూనివర్సిటీలో చదవడం వల్ల విద్యార్థులకు ప్రత్యేకమైన గుర్తింపు కూడా ఉంటుందని వివరించారు. అందువల్ల యూనివర్సిటీలో చదివే యుజి, పీజీ విద్యార్థులు న్యాక్ గుర్తింపుకు కృషి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాస్, మహిళా డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ రాజారాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నల్లగొండ ఎస్పీ

నవతెలంగాణ-సూర్యాపేట

నల్లగొండ జిల్లాకు నూతనంగా ఎస్పీగా నియామకమైన అపూర్వారావు శుక్రవారం సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి అపూర్వరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.బాగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.



బడ్జెట్లో చేతి వృత్తిదారులకు 20వేల కోట్లు కేటాయించాలి

- వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, గంజి మురళీధర్

నవతెలంగాణ -నల్లగొండ

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో చేతి వృత్తిదారులకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, గంజి మురళీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .శుక్రవారం నలగొండ జిల్లా కేంద్రంలో అవిశెట్టి శంకరయ్య అధ్యక్షతన జరిగిన చేతి వృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. చేతివృత్తిదారులకు ప్రతి సంవత్సరం బడ్జెట్లోనామమాత్రపు కేటాయింపులు ప్రకటిస్తూ ఖర్చు చేయకుండా వృత్తిదారులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో చేతివృత్తులు కొనసాగిస్తున్న పేదలు ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేక వృత్తులను వదిలేసుకొని ఉపాధి కోసం



వెతుక్కునే పరిస్థితి వచ్చిందని అన్నారు .గ్రామీణ ప్రాంతాల్లో చేతివృత్తులను ప్రభుత్వాలు ప్రోత్సహించడం ద్వారా అనేకమందికి వాటి ద్వారా ఉపాధి దొరకడంతో పాటు చేతివృత్తులను పరిరక్షించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా గొర్రెల కాపరులకు గొర్రెలు కొనుగోలు చేయడానికి నగదు బదిలీ అమలు చేస్తామని వారి లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం నేటి వరకు నగదు బదిలీ చేయకుండా వారి ఖాతాలను ఫ్రీజింగ్ లో పెట్టడం ద్వారా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయడానికి ఫ్రీజింగ్ ఎత్తివేసి నగదు బదిలీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వృత్తిదారులందరికీ సొంత ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ,అర్హులైన వారికి ఐదు వేల రూపాయలు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, మత్స్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు గాలి నరసింహ, మురారి మోహన్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కందగట్ల గణేష్, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా నాయకులు మెట్టు నరసింహ ,సాగర్ల మల్లేష్, జాల ఆంజనేయులు, సంఘం జిల్లా నాయకులు కర్నాటి శ్రీరంగం, సంగెం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిపై ఏసీపీకి ఫిర్యాదు

నవతెలంగాణ - భువనగిరి

రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టకుండా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ బి,నాగిరెడ్డి పై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏసీపీ సైరెడ్డి వెంకట్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి, ఇమ్రాన్, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షులు అతహార్ విజిలెన్స్ మోనిటరీ కమిటీ సభ్యులు సిరిపంగ శివలింగం మాట్లాడుతూ భువనగిరి మున్సిపల్ కమిషనర్ ఉద్దేశపూర్వకంగానే బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టకుండా ఉన్నత అధికారులను తప్పుదోవ పట్టించి ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి సమక్షంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని పూర్తి చేయించారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి దళిత బడుగు బలహీన వర్గాలకు చెందిన మహనీయులను అవమానపరిచారని ఆయన మీద చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు ఈరపాక నరసింహ పడిగెల ప్రదీప్ కర్తాల శీను, కేవీపీఎస్ పట్టణ అధ్యక్షులు అన్నంపట్ల కృష్ణ, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు కుతాడి సురేష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల రాజు, డాకూరి ప్రకాష్, కోళ్ల కృష్ణ నివాస్ సిరిపంగా నాగరాజు చందు శోభన్ వసీం పాల్గొన్నారు.

కార్మికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

నవతెలంగాణ-దేవరకొండ

కార్మికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం ఉంటుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మోటార్ వాహనాల, ట్రాక్టర్స్, వివిధ కార్మికులు వందమంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.వారికి ఎమ్మెల్యే గులాబీకండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ క్రియాశీలక పాత్ర వహిస్తుందన్నారు. ప్రజాసంక్షేమపథకాలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు,కార్మికులు పెద్దసంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, యుగంధర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కేశని లింగారెడ్డి, వల్లపురెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, ఇలియాస్ పటేల్, అర్జున్‌సింగ్, సద్దాం, అప్రోచ్, తదితరులు పాల్గొన్నారు.





భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలి

- బీసీడబ్ల్యూయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి

నవతెలంగాణ -భువనగిరిరూరల్

గతేడాది మేడే రోజున కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు లక్ష మోటార్ సైకిళ్లను సబ్సిడీపై వెంటనే ఇవ్వాలని బీసీడబ్ల్యూయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ మంత్రి ప్రకటించిన విధంగా సబ్సిడీపై ఇచ్చే మోటార్ సైకిళ్ల ప్రక్రియకు విధివిధానాలు ప్రకటించి వెంటనే అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తమ అవసరాల నిమిత్తం తీసుకున్న రూ.1005 కోట్ల తిరిగి సంక్షేమబోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న 54 వేల క్లెయిమ్స్ కు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసిడబ్ల్యు జిల్లా అధ్యక్షులు గొరిగె సోములు, రాష్ట్ర కమిటి సభ్యులు రాధారపు మల్లేశం, కూరెళ్ళ నర్సింహ, నాయకులు గాడి శ్రీనివాస్, చుక్క రామచంద్రం, ఈర్ల మైసయ్య, కొంగరి మారయ్య, తూటి వెంకటేశం, దండు అమరేందర్, బిక్షమయ్య, మల్ల కుమార్, శంకర్, ఎస్కె శ్రీను, వంగాల మారయ్య, జూపెల్లి బాబు, నెలికంటి జంగయ్య, వీసం అంజయ్య, పాపయ్య, పోచయ్య పాల్గొన్నారు.

బంజారా సమాజ్ వాసుల బస్సును ప్రారంభించిన స్వామినాయక్

నవతెలంగాణ-పెద్దవూర

మహారాష్ట్రలో జరిగే శ్రీ బాలాజీ భగవాన్ ప్రసాద స్వీకరణకై అఖిలభారతబంజారా కుంభమేళా జాతర నాగార్జునసాగర్ సంత్ సేవాలాల్ ఆశీస్సుల కోసం వెళుతున్న నియోజకవర్గ బంజారా సమాజ్ బస్సుకు శుక్రవారం వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమావత్ స్వామినాయక్ పెద్దవూర మండల కేంద్రంలోని నాగార్జునసాగర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బంజారా సేవా నాయకులు బాణావత్ శంకర్‌నాయక్, చీనానాయక్, రవినాయక్, వినోద్, రమేష్, బీకోజీనాయక్ పాల్గొన్నారు.

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అపూర్వరావు

నవతెలంగాణ -నల్గొండ

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా అపూర్వరావ్ గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. వనపర్తి జిల్లా ఎస్పీగా పని చేస్తూ నల్గొండకు బదిలీ అయ్యారు . ఇప్పటివరకు పని చేసిన ఎస్పీ రెమా రాజేశ్వరి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రజల కోసం సత్వర న్యాయం అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటివరకు నల్లగొండ ఎస్పీ గా పని చేసిన రెమా రాజేశ్వరి రామగుండం కమిషనర్ గా బదిలీ అయిన విషయం తెలిసిందే. పోలీస్ సంఘం నాయకులు, పలువురు పోలీసు అధికారులు నూతన ఎస్పీకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యస్.బి డిఎస్పీ మొగిలయ్య నల్లగొండ డిఎస్పీ నరసింహ రెడ్డి, దేవరకొండ డిఎస్పీ నాగేశ్వర రావు, మిర్యాలగూడ డిఎస్పీ వెంకటేశ్వర రావు, సిఐలు, ఆర్.ఐ లు, ఎస్సైలు, డి.పి.ఓ సిబ్బంది ఎస్పీ గారికి స్వాగతం పలికారు.



పేద కుటుంబాలకు జన చైతన్య ట్రస్ట్ చేయూత



నవతెలంగాణ-హుజూర్‌నగర్

పేద కుటుంబాలకు జన చైతన్య ట్రస్ట్ చేయూతగా ఉండి వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ పినపరాళ్ల వంశీ, అధ్యక్షుడు పారా సాయి తెలిపారు శుక్రవారం పట్టణంలోని మల్లన్ననగర్‌లో నివాసముంటున్న ముదిగొండ సైదులు నాగమణి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుందని తన సంస్థ దృష్టికి రావడంతో వెంటనే 50 కేజీల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు.ఇదే విధంగా పట్టణంలో గతంలో పలు కుటుంబాలకు సాయం అందించామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పినపరాళ్ల వంశీ, ఉపాధ్యక్షుడు పిల్లి శివశంకర్, కార్యదర్శి దగ్గుపాటి రమేష్,బీవీశ్రీపతి, కె.సాయి,కాశీ, విశ్వనాథ్, వి.సైదులు, రాజేష్ పాల్గొన్నారు.

'కంటివెలుగు' శిబిరాన్ని పరిశీలించిన ఎంపీపీ

నవతెలంగాణ-గరిడేపల్లి

మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో ఎంపీపీ సుజాత శ్రీనివాస్‌గౌడ్,జెడ్పీటీసీ పోరెడ్డి శైలజరెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉపయోగించుకొని తమకు ఉన్నటువంటి కంటి సమస్యలను దూరం చేసుకుంటున్నారన్నారు.గ్రామంలో ఏర్పాట్లను చూసుకుంటున్న సర్పంచ్ జోగు సరోజిని పిచ్చిరెడ్డిని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, మండలాధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు

- ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

అతివేగంగా వస్తున్న కారు పల్టీ కొట్టి ముగ్గురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామ శివారులోని చెరువు కట్టపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆత్మకూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు జాన్ పహాడ్ ఉర్సుకు వెళ్లి వస్తుండగా తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కాగా మిడతపల్లి ముఖేష్, నవిలే సత్యమ్మ, పల్లెల వెంకన్న, నవిల రమాదేవి, నవిలె రవి ప్రయాణం చేస్తుండగా సత్తెమ్మ వెంకన్న రమాదేవిలకు గాయాలయ్యాయి కాగా చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ

శనివారం 28 జనవరి 2023



అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

ఎన్జీ కళాశాలలో వివిధ సబ్జెక్టులలో ఖాళీగా ఉన్న అతిధి ఆధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గణ శ్యామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతుశాస్త్రంలో 1,వాణిజ్య శాస్త్రంలో 2, గణిత శాస్త్రంలో 1 చొప్పున ఖాళీలో ఉన్నట్లు తెలిపారు.దరఖాస్తు చేసుకునేందుకు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీలు అభ్యర్థులు అయితే 50 శాతం మార్కులు కలిగి ఉన్నవారు అర్హులని తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా బయోడేటాతో జిరాక్స్ ప్రతులను జత చేసి కళాశాల కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. 31న ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని తెలిపారు. పీహెచ్డీ చేసిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత అనంతరం నెట్, సెట్ చేసిన అభ్యర్థులు ఆ తర్వాత పీజీ అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దేవరకొండ



కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ సూచించారు .శుక్రవారం పట్టణంలోని మూడో వార్డులో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న వారికి కళ్ళ అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రహత్ అలీ, మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ జాఫర్ అలీ, వార్డు కౌన్సిలర్ రజియా సుల్తానా, డాక్టర్లు, మెడికల్ సిబ్బంది సఫియా, లింగయ్య, మెప్మా టిఎంసి జగమంతు, మున్సిపల్ సిబ్బంది రవికుమార్, ఏఎన్ఎంలు, ఆర్పీలు ,తదితరులు పాల్గొన్నారు.

చండూరు మున్సిపాలిటీలో ఆకలి కేకలు

- మూడు నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు

నవతెలంగాణ -చండూర్



చండూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో మున్సిపల్ కార్మికుల ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. పూట గడవని పరిస్థితి వారి కుటుంబాల్లో నెలకొంది. సంక్రాంతి పండుగ పస్తులుండి పండుగ జరుపుకున్నారు. మొత్తం 55 మంది ఒప్పంద కార్మికులు, కార్యాలయ సిబ్బంది పని చేసున్నారు. వీరికి నెలకు సుమారు ఏడు లక్షల పైచిలుకు జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వీరికి పట్టణ ప్రగతి నిధులు. జనరల్ ఫండ్ నుంచి జీతాలు చెల్లిస్తూ ఉన్నారు. కానీ పట్టణ ప్రగతి నిధులు నెలవారిగా విడుదల కాకపోవడంతో, జనరల్ ఫండ్ సరిపడ లేకపోవడంతో వీరికి జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. మున్సి పాలిటీకి ప్రధానంగా పట్టణ ప్రగతి నిధులు, ఆస్తి పన్నుల నిధులు మాత్రమే పెద్దదిక్కుగా ఉన్నాయి. ఈ నిధులు మున్సిపాలిటీ నిర్వహణకు ఎంత మాత్రం సరిపోవడం లేదు. మరోపక్క మున్సిపాలిట అభివృద్ధికి కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తోంది. కానీ మున్సిపాలిటీ నిర్వహణకు, సిబ్బందికి జీతాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి అవసరం ఎంతైనా ఉంది. అత్యవసరమైన ఏమైనా నిధులు ఖర్చు చేయాల్సి ఉంటే మున్సిపాలిటీ ఖజానాలో రూపాయి ఉండడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మున్సిపల్ సిబ్బంది సమ్మె బాట

మున్సిపల్ కార్మికులు తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మె గురువారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువు కార్మికులు మాట్లాడుతూ తమకు పూర్తిగా వేతనాలు ఇచ్చేంతవరకు సమ్మె బాట వదిలేది లేదని తేల్చి చెప్పారు. ఆ రోజులుగా సమ్మె చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ప్రతి నెలా జీతాలు సక్రమంగా రాకపోవడంతో తమ కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా తమకు జీతాలు వచ్చేంతవరకు సమ్మె విరమించేది లేదన్నారు.

ప్రతినెలా సక్రమంగా జీతాలు అందించాలి
మున్సిపల్ కార్మికుడు రామచంద్రం



చండూరు మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రతి నెల జీతాలు అందించాలి. ప్రతినెల జీతం సక్రమంగా రాకోకపోవడంతో కుటుంబం నడవడం కష్టంగా ఉంది. తమని ప్రభుత్వం గుర్తించి గత పది నెలల పెరిగిన జీతం ఏరియాస్ వెంటనే చెల్లించాలి.

ఐదు రోజులుగా సమస్య చేపడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు
అన్నవర్తి దయాకర్ మున్సిపల్ కార్మికుడు



స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు తమకు వేతనాలు చెల్లించాలని ఐదు రోజులుగా సమ్మె చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి నెల జీతాలు ఇవ్వడం లేదు మూడు, నాలుగు నెలలకు ఒకసారి చెల్లిస్తున్నారు. మొత్తం పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. కొన్ని నెలలు పెండింగ్లో ఉంచుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు ఆదివారం సెలవు ప్రకటించాలి
సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం గౌడ్



మున్సిపల్ కార్మికులకు ఆదివారం సెలవు ప్రకటించాలి. సమ్మె చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే కూసుకుల ప్రభాకర్ రెడ్డి బాధ్యత వహించి వెంటనే కార్మికులకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలి.

వేతనాలను జమచేస్తాం
మున్సిపల్ చైర్ పర్సన్
తోకల చంద్రకళ వెంకన్న



ఒకటి లేదా రెండు రోజుల్లో పెండింగ్లో ఉన్న మున్సిపల్ కార్మికుల వేతనాలను వారి అకౌంట్లో జమ చేస్తా కార్మికులు ఎవరు కూడా అధైర్య పడకుండా సమ్మె విడిచి విధుల్లో యథావిధిగా కొనసాగాలి.

మార్చి 11,12 తేదీల్లో టీఎంఎస్ఆర్యూ కౌన్సిల్ సమావేశాలు

నవతెలంగాణ -నల్లగొండ



తెలంగాణమెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు పోరాటాల పురిటిగడ్డ నల్గొండ జిల్లా కేంద్రం లో మార్చి 11,12 తేదీలలో జరుగుతున్నాయని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష సంయుక్త ప్రధాన కార్యదర్శులు సిహెచ్ భానుకిరణ్ ,ఏ.వి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యూటీఎఫ్ భవన్లో ఆ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశాల ఆహ్వాన సంఘం చైర్మెన్గా మాజీ ఎమ్మెల్యే మిర్యాలగూడ జూలకంటి రంగారెడ్డి, నల్గొండ జిల్లా కి సంబంధించిన వివిధ వివిధ రంగాల్లో ప్రముఖులైన ఔత్సాహికులు ,వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తలు ,కార్మిక వర్గ నాయకులను ఆహ్వాన సంఘం ఉన్నారని అన్నారు. ఈ సమావేశాలు మార్చి 11,12 తేదీల్లో నల్గొండ పట్టణంలోని హోటల్ మనోరమ లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా మందుల రంగంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ కౌన్సిల్ సమావేశాల్లో చర్చిస్తామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి మా డిమాండ్లు తెలియజేస్తామని అన్నారు. ప్రభుత్వ రంగ ఫార్మా వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్కు రూ.26వేల కనీస వేతనంగా నిర్ణయించాలని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో మా యొక్క భవిష్యత్ కార్యక్రమం నిర్ణయిస్తామన్నారు. ఆహ్వాన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శిగా రావుల రవికుమార్, కోశాధికారిగా పోలా రమేష్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి ,జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, టీమ్ ఎస్ ఆర్ యు రాష్ట్ర కమిటీ సభ్యులు కోట సుధాకర్ నల్గొండ అధ్యక్షులు చెరిపల్లి నిరంజన్ కార్యదర్శి ఆర్ రవికుమార్ కోశాధికారి పోలా. రమేష్, సోమస్వామి అనుదీప్ నరేష్ మచ్చ గిరి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించి ఆదుకోవాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ శ్రీశైలం

నవతెలంగాణ- మునుగోడు



కౌలు రైతులను తక్షణమే గుర్తించి, ప్రభుత్వం ఆదుకోవాలనిరైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. బుధవారం మునుగోడు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను విస్మరిస్తున్నారని, కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి,వారికి గుర్తింపు కార్డులు,రుణమాఫీ, బ్యాంకు రుణాలు, రైతుబంధు లాంటి రైతులకు ఇచ్చే సంక్షేమ పథకాలని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కల్వలపల్లి గ్రామంలో 55 మంది కౌలు రైతులు ఉన్నారని, వారు ప్రధానంగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఆ గ్రామంలో దాదాపు 5000 నుంచి 7000 వరకు భూమిని కౌలు తీసుకొని, కౌలు రైతులు సేద్యం చేస్తున్నారని తక్షణమేప్రభుత్వం కౌలు రైతుల ఆదుకోవాలన్నారు,ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మిర్యాల భరత్, రైతు సంఘము జిల్లా కమిటీ సభ్యులు సాగర్ల మల్లేశం,రైతు సంఘము మండల కమిటీ అధ్యక్షులు వేముల లింగస్వామి, యాట యాదయ్య సీఐటీయూ నాయకులు, యాసరాణి శ్రీను రైతు సంఘము సభ్యులు శివర్ల వీరమళ్ళు వంటే పాక అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు రాత్రికి స్వామి వారి కల్యాణం
- ఫిబ్రవరి 2వరకు బ్రహ్మోత్సవాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ నవీన్

నవతెలంగాణ - నార్కట్ పల్లి



శైవ దేవాలయాల్లో అత్యంత ప్రాముఖ్యత గల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామిచెరువుగట్టు దేవస్థానం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. నేడు స్థానిక శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య పూర్ణాహుతిని వెలిగించి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారి కళ్యాణం జరగనుంది మంగళవారం తెల్లవారుజామున ఈనెల 31న స్వామి వారి అగ్నిగుండాలు, ఫిబ్రవరి 1న దోపోత్సవం అశ్వావాహన సేవ, ఆదే రోజు రాత్రి మహ పూర్ణాహుతి పుష్పోత్సవం, ఏకాంత సేవ లు ఫిబ్రవరి 2న, చెరువుగట్టు ఎల్లారెడ్డిగూడెం గ్రామాలలో గ్రామోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



వార్షిక బ్రహ్మోత్సవముల కు సర్వం సిద్ధం

చెరువుగట్టు శ్రీ పార్వతి జడల జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. అంతర్ రాష్ట్రాల నుంచి వేలాదిగా రానున్న భక్తుల కోసం ఆలయ అధికారులు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేశారు. ఆలయ కళ్యాణ మండపం ముందు భాగం నిర్మాణంలో ఉండడంతో కల్యాణ మండపంలో కల్యాణం నిర్వహించకుండా ముందు భాగంలో కల్యాణం జరిగే విధంగా ముస్తాబు చేశారు. భక్తుల కోసం మంచినీటి సౌకర్యం ప్రత్యేకంగా సింటెక్స్ ట్యాంకుల ద్వారా అందించేందుకుఏర్పాటు చేశారు. భక్తుల వాహనాల కోసం ఎల్లారెడ్డిగూడెం నుంచి చెరువుగట్టు వెళ్లే దారిలో 15 ఎకరాలు నార్కట్ పల్లి బిఅద్దంకి రహదారి నుంచి చెరువుగట్టుకు వెళ్లే దారిలో 8 ఎకరాలలో ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు. భక్తులకు మూత్రశాలలు మరుగుదొడ్ల కోసం 70 శాశ్వత 30 తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ నవీన్

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేసాం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా పోలీస్ వారి సహకారంతో రోడ్డు వెంబడి ఉన్న దుకాణాలు తొలగించి, స్వామి వారి కళ్యాణం అగ్నిగుండాలు జరిగేటప్పుడు వాహనాలను గట్టు పైకి అనుమతించకుండా భక్తుల సౌకర్యార్థం కొన్ని వాహనాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నేటి నుంచి ప్రారంభమయ్యే శ్రీ పార్వతి జడ రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులతో దేవాదాయ శాఖ సమన్వయంతో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నర్సింహారెడ్డి, ఆర్డిఓ జయ చంద్రారెడ్డి, స్థానిక తహసిల్దార్ మురళీమోహన్ ఎంపీడీవో యాదగిరి గౌడ్ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్ కార్య నిర్వహణ అధికారి నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలికవసతుల కల్పనే లక్ష్యం

నవతెలంగాణ-మిర్యాలగూడ



ప్రభుత్వ పాఠశాలలో మౌలికవసతుల కల్పనకు మన ఊరి మనబడి కార్యక్రమం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తుందని రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డి పేర్కొన్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలగడప, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మిర్యాలగూడ, ప్రాథమిక పాఠశాల గాంధీనగర్లలో మన ఊరు మనబడి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే నిరుపేద వర్గాల విద్యార్థులకు ఆధునిక వసతులతో అన్ని సౌకర్యాలు కల్పించుటకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం అన్ని పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు పాఠశాలలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ కుర్ర విష్ణు, ఆలుగడప పీఏసీఎస్ చైర్మెన్ రామకృష్ణ, 17వ వార్డు కౌన్సిలర్ రావూరి రవి, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఎంఈఓ బాలాజీనాయక్, ఏఈ ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు కొత్త రాఘవేంద్ర ప్రసాద్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్ సేవలు మరువలేనివి



- వర్ధంతిసభలో ఎమ్మెల్యే భాస్కరరావు

నవతెలంగాణ-మిర్యాలగూడ

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు తిరునగర్ గంగాధర్ సేవలు మరువలేనిదని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అన్నారు.3వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద గల గంగాధర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.పట్టణంలో ఎంతో మంది పేద ప్రజలకోసం ఆయన పని చేశారన్నారు.రాజకీయ నాయకుడిగా ఎంతోమందికి మార్గదర్శకులుగా నిలిచారని కొనియడారు.కాంగ్రెస బలోపేతానికి ఆయన పాటుపడ్డారన్నారు.ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గంగాధర్ తనయులు, మున్సిపల్ చైర్మెన్ తిరునగరు భార్గవ్, తెలంగాణ రాష్ట్ర అగ్రోస్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ధనావత్ చిట్టిబాబునాయక్, మున్సిపల్ మాజీ చైర్మెన్ మెరుగు రోశయ్య, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ మగ్దూంపాషా, కౌన్సిలర్ వంగాల నిరంజన్‌రెడ్డి, నాయకులు మన్నెం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్వాతంత్ర సమరయోధుడు మాజీ సైనికుడు తిరునగర్ గంగాధర్ ఆశయాలను సాధించాలని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి కోరారు.మూడవ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నల్గొండ రూరల్:నల్లగొండ మండలంలోని అన్నేపర్తి గ్రామం ఎస్సీ కామినియట్ హాల్ దగ్గర2023 కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లు రవీందర్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్ర గతిని మార్చిన మార్క్స్ జీవిత లక్ష్యమైన దోపిడీ లేని సమాజాన్ని ప్రపంచంలో ఎక్కడా లేని దుర్మార్గమైన కుల వ్యవస్థను రూపుమాపడానికి తమ సర్వస్వం త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మార్గదర్శకంలో సామాజిక ఉద్యమాలు ముందుకు సాగాలని అన్నారు. నేడు దేశంలో మనోభావాల పేరిట మనుషుల పైన జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు ప్రజల ప్రశాంతతను దెబ్బతీస్తాయని చెప్పారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం లో కెవిపిఎస్ గ్రామ కమిటీ సభ్యులు మామిడి జగన్ చినపాక కృష్ణ మామిడి అశోక్ గాద వినయ్ మేడి గట్టయ్య వంటల శ్రీకాంత్ గాదభిక్షం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పింఛన్ల పంపిణీ

నల్గొండ కలెక్టరేట్: నేటి నుండి ఈ నెల 31 వరకు ఆసరా పింఛన్లను సంబంధిత పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏపీడీ కాళిందిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళ పింఛన్‌దారులు సూచించిన తేదీలోగా పింఛన్లను పొందాలని పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో వేరే మున్సిపాలిటీ, మండలాలలో నమోదైన పింఛన్దారుల పేర్లు ఈ నెల నుండి సరి చేసినట్లు తెలిపారు.

మునుగోడు నియోజకవర్గానికి మహార్దశ తీసుకొస్తా



నవతెలంగాణ -చండూర్

మునుగోడు కి అధిక నిధులు కేటాయించి నియోజకవర్గనికి మహర్దశ తీసుకవస్తామని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.శుక్రవారం చండూర్ మండలం లో నెర్మట గ్రామంలో 50 లక్షలు , జోగిగూడం గ్రామంలో 30 లక్షలు,20 లక్షల విలువగల గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన, ధోనిపాముల గ్రామంలో 60 లక్షల, తిమ్మారెడ్డి గూడం గ్రామంలో 30 లక్షలు , 20 లక్షల విలువగల గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన, తుమ్మలపల్లి గ్రామంలో 50 లక్షల, బంగారిగడ్డ గ్రామంలో 60 లక్షల, 30 లక్షల విలువగల కల్వెర్ట్‌కు శంకుస్థాపన, కోటయ్యగూడం గ్రామంలో 20 లక్షలు , ఉడ్తలపల్లి గ్రామంలో 30 లక్షలు , కస్తల గ్రామంలో 90 లక్షలు సీసీ రోడ్లకు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.అదేవిదంగా కస్తల గ్రామంలో 33/11 కె.వి సబ్బ్‌టేషన్ ను ప్రారంభించారు. గ్రామాలలో బి ఆర్ఎస్ జెండాలను ఎగుర వేశారు.సీఎం కెసిఆర్ దీవెనలతో మునుగోడుకు మరిన్ని నిధులను తెచ్చి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లి కళ్యాణి రవికుమార్, జడ్పిటిసి కర్నాటి వెంకటేశం, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అసెంబ్లీలో ప్రకటించిన మోటార్ సైకిల్స్ వెంటనే ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ

నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్



భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మోటార్ సైకిల్స్ ఇస్తానన్న హామీని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్మికు ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఏవో మోతిలాల్ డీసీఎల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వెల్ఫేర్ బోర్డు కార్డు ఉన్న కార్మికుల అందరికీ మోటార్ సైకిల్ ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారని, అదేవిధంగా మే 1న మోటార్ సైకిల్ ఇస్తామని కార్మిక శాఖ మంత్రి కూడా ప్రకటించారని గుర్తు చేశారు. 9 నెలలు గడిచిన నేటికి ఎలాంటి విధి విధానాలు రూపొందించలేదని వెంటనే మోటార్ సైకిల్స్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో మూలుగుతున్న 3700 కోట్ల పెండింగ్ క్లెయిమ్స్‌ని క్లియర్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 54 వేల క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రమాద మరణాలు, సహజ మరణాలు, వివాహ, ప్రసూతి కానుకలు ఇతర బెనిఫిట్స్ కి ఇచ్చే నష్టపరిహారం పెంచాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోలే సత్యనారాయణ, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సల్వోజు సైదాచారి, యూనియన్ జిల్లా నాయకులు బై రోజు ఆంజనేయులు, గడగోజు శ్రీనివాస చారి, పోలే లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతర సందర్భంగా కబడ్డీపోటీలు

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని తుంగతుర్తి గ్రామంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 01 వరకు జరుగనున్న శ్రీ స్వయంభూ పార్వతీ సమేత సోమేశ్వర స్వామికల్యాఉత్సవాలలో భాగంగా నేటి నుంచి ఐదు రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.ఈ పోటీలలో మొదటి బహుమతి 70,000 లు,రెండవ బహుమమతి 50,0000,మూడవ బహుమతి 40,000 లు,నాలుగవ బహుమతి 25,000 లు,ఐదవ బహుమతి 20,000 లు,ఆరవ బహుమతి 15,000లు ఏడవ బహుమతి 12,000 లు,ఎనిమిదవ బహుమతి 10,000 లు,తొమ్మిదవ బహుమతి 7,000 లు ప్రైజ్ మనీ మరియు షీల్డులు బహుకరించడం జరుగుతుందని తెలిపారు.ఈ ఉత్సావాలకు జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్,ఉమ్మడి జిల్లా ఎంఎల్‌సీ ఎంసీ కోటిరెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి హాజరవుతున్నందున ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సావాలను విజయవంతం చేయాలని తెలిపారు.

ఉపసర్పంచ్ చెక్కులపై సంతకాలు పెట్టకపోవడంతో స్తంభించిన పాలన

నవతెలంగాణ-డిండి

ఉపసర్పంచ్ చెక్కులపై సంతకాలు పెట్టకపోవడంతో పాలన స్తంభించిందని డిండి సర్పంచ్ మేకల సాయమ్మకాశన్న శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. డిండి గ్రామపంచాయతీలో శుక్రవారం పాలకవర్గం సమావేశం సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న అధ్యక్షతన నిర్వహించారు.సమావేశంలో పలు సమస్యలపై చర్చకు రాగా పంచాయతీ కార్యదర్శికి, ఉపసర్పంచ్ వెంకటేష్‌కు రిపబ్లిక్ డే వేడుకలకు వ్యక్తిగతంగా నాకెందుకు ఫోన్ చేయలేదనే వాదోపవాదనలు జరుగుతుండగా కార్యదర్శి సమాధానం తెలుపుతూ నోటీసు పంపించాను కదా సంతకం చేశారు సరిపోయిందని అనడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది.సర్పంచ్ జోక్యం చేసుకొని సమస్యను సద్దుమణిగించేందుకు యత్నించింది.ఈ విషయాన్ని తర్వాత మాట్లాడుకోవచ్చు ముందుగా ఈ సమావేశాన్ని సజావుగా సాగనివ్వండని, ఐదారు నెలల నుంచి డిండి గ్రామంలో చేసిన పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ పనులు, మోటర్లు కాలిపోవడంతో కొత్త మోటర్లను బిగించడం, వీటన్నింటికీ పనుల నిమిత్తం చెక్కులపై సంతకాలు పెట్టమని సర్పంచ్ ఉపసర్పంచ్ వెంకటేష్‌ను కోరగా ఇద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. తను మహిళా సర్పంచ్ అని కూడా చూడకుండా దుర్భాషలాడాడని ఆవేదన వ్యక్తంచేశారు.

జెండా ఆవిష్కరించిన ఎలక్ట్రిషన్లు

నవతెలంగాణ -చిట్యాలటౌన్



బల్బును కనుగొన్న థామస్ ఆల్బర్ట్ ఎడిసిన్ జన్మదినం సందర్భంగా ఎలక్ట్రిషన్ డే ను శుక్రవారం పట్టణ కేంద్రంలో శుక్రవారం తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఖమ్మంపాటి నరసింహ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల గౌరవ అధ్యక్షులు బెల్లి యాదయ్య, అధ్యక్షుడు దేశపాక యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు బరాల స్వామి మండల గౌరవ సలహాదారు అరూరి సత్తయ్య ,సీనియర్ ఎలక్ట్రీషియన్ తుకారం, గంజి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు



ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-మఠంపల్లి

మండలకేంద్రానికి చెందిన చిన్నపంగు లచ్చయ్య కుమారుడు గోపి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం గోపిని పరామర్శించారు.దీంతో అతనికి మందుల కోసం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే సహకారంతో వైద్యం చేయిస్తానని కుటుంబానికి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆరాల నాగరాజు, పొట్టవెంకన్న, ఆరాల వీరస్వామి, కొమ్ము సైదులు, సీతంజోసు, మంగళపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.



సాగర్ సిమెంట్ పరిశ్రమలో 42వ వార్షికోత్సవం

నవతెలంగాణ-మఠంపల్లి

మండలకేంద్రంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో 42వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.42 ఏండ్ల కాలంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పించా మన్నారు.అనంతరం ఉద్యో గులకు, కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు మోహన్‌రెడ్డి, హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- దర్గా అభివృద్ధికి రూ.25 లక్షలు
- పలు కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-పాలకవీడు



రానున్నఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తులు ఉండవని, తాము రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వస్తామని నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు హాజరైన ఆయన, దర్గా అభివృద్ధికి తన నిధుల నుండి రూ.25 లక్షలు కేటాయిస్తున్నామని తెలిపారు.తమ హయాంలో నేరేడుచర్ల, మఠంపల్లి నుండి జాన్‌పహాడ్ దర్గా వరకు డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు.తొమ్మిందేండ్ల కాలంలో బీఆర్ఎస్ మాటలు తప్ప ఈ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు.రానున్న బడ్జెట్‌లో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ, నిరుద్యోగభృతి, పంటలబీమా పథకం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల హామీ కి కేటాయింపులు పూర్తిస్థాయి దళితులకు గిరిజనకు దళితబంధు, సమభావన సంఘాలకు ఇవ్వాల్సిన రూ.4,000 కోట్ల రూపాయల బకాయిలకు స్థానం కల్పించి, కేసీఆర్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.బీజేపీ, బీఆర్ఎస్ చిల్లరరాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయని ఆరోపించారు.గవర్నర్ స్థాయి వ్యక్తులు రాజ్యాంగపరిధికి లోబడి పని చేయాలని సూచించారు.భవానిపురం డెక్కన్ సిమెంట్స్ కర్మాగారంలో ఇటీవల అకాల మరణం చెందిన ఓ కుటుంబాన్ని ఎంపీ పరామర్శించారు.అనంతరం మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గడ్డం సైదులు కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అప్పిరెడ్డి, ఎంపీపీ గోపాల్‌నాయక్, బెట్టేతండా సర్పంచ్ మోతిలాల్‌నాయక్, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు సుబ్బారావు, ఎంపీటీసీ మీసాల ఉపేందర్, కొనతం వెంకటరెడ్డి, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, నాగయ్య, నీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొదమగుండ్ల వీరయ్య మృతి పట్ల నివాళులు

నేరేడుచర్ల :నేరేడుచర్ల మున్సిపాలిటీపరిధిలోని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ తండ్రి కొదమగుండ్ల వీరయ్య శుక్రవారం ఉదయం 10 గంటలకు అనారోగ్యంతో మరణించారు.ఆయన మృతదేహాన్ని పట్ల ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరువుపల్లి సీతారాములు,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లులక్ష్మీ సందర్శించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగా ర్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, నెమ్మాది వెంక టేశ్వర్లు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మెన్ చందమల్ల జయ బాబు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటే శ్వరరావు, మట్టపల్లి సైదులు, ములకలపల్లి రాములు, తాటికొండ రామ నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ చల్లా శ్రీలతరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ధూళిపాల ధనుంజయనాయుడు, సీపీఐ(ఎం) నాయకులు కందగట్ల అనంతప్రకాష్, ఎస్‌కె.యాకుబ్, చిత్తలూరి సైదులు ఉన్నారు.



'నవతెలంగాణ'వార్తా కథనానికి స్పందన

- రైతుల పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-చివ్వెంల



నకిలీలతో రైతు విలవిల అనే కథనం నవతెలంగాణ దినపత్రిక గురువారం ప్రచురించిన కథనానికి స్పందించిన మండల వ్యవసాయ అధికారి ఆశా కుమారి వరిపోలాన్ని పరిశీలించారు.సంబంధిత రైతులతో జరిగిన పంట నష్టాన్ని తెలుసుకున్నారు.అనంతరం ఐలాపురం శివారులోని శ్రీ వర్ధన్ అగ్రో ట్రేడర్స్ దుకాణాన్ని పరిశీలించి యజమానితో మాట్లాడడం జరిగింది.సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు.

ఉపాధిహామీ పనులు యుద్ధప్రతిపాదికన ప్రారంభించాలి

నవతెలంగాణ-చివ్వెంల

ఉపాధి హామీ పనులు యుద్ధప్రతిపాదికన ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మట్టిపెల్లి సైదులు విమర్శించారు.శుక్రవారం మండలపరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధిచట్టాన్ని కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టం స్ఫూర్తికే విరుద్ధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర రామ్‌చరణ్, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు దోనేటి పిచ్చయ్య,గొర్రెలు,మేకల పెంపకం దారుల సంఘం జిల్లా నాయకులు తుడుచు సోమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాంపాటి రాములు తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్‌లో భారీగా పెరిగిన వడ్డీరేట్లు

నవతెలంగాణ-తిరుమలగిరి

తపాలా శాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని సూర్యాపేట ఈస్ట్ సబ్ డివిజన్ అధికారి జి.సురేష్ తెలిపారు.శుక్రవారం తిరుమలగిరిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భారత ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని పొదుపు పథకాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.భారత ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి పోస్టాఫీసు వడ్డీరేట్లను సవరిస్తూ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా జనవరి 1, 2023 నుంచి పోస్ట్ ఆఫీస్ వడ్డీరేట్లు భారీగా పెంచిందని, వాటికి సంబంధించిన వివిధ స్కీముల వడ్డీరేట్ల వివరాలను వెల్లడించారు. సేవింగ్స్ అకౌంట్ 4 శాతం, రికరింగ్ డిపాజిట్ ఎకౌంట్ 5.8 , టైం డిపాజిట్ ఎకౌంట్ మంత్లీ ఇన్కమ్ స్కీం అకౌంట్‌కు 7.1 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు 7 శాతం, కిసాన్ వికాస్ 7.2 శాతం, సీనియర్ సిటిజన్ అకౌంట్‌కు 8 శాతం, సుకన్య సమృద్ధి అకౌంట్‌కు 7.6 శాతం, పిపీఎఫ్ అకౌంట్ 7.1 శాతం పెరిగాయని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పోస్టుల అధికారి గౌని సురేష్ కోరారు.



ఈ-శ్రమ్ కార్డుల నమోదులో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులందరికీ ఈ-శ్రమ్ కార్డులు అందిం చాలని అదనపు కలెక్టర్ యస్.మోహన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ-శ్రమ్ ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.జిల్లాలో మొత్తం 370496 మందికి ఈ శ్రమ్ కార్డులు అందించే లక్ష్యం కాగా ఇప్పటివరకు 117675 మంది కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు అందించామన్నారు.రాష్ట్రంలో 16 స్థానంలో జిల్లా ఉందని, ఈ నమోదు ప్రక్రియలో మరింత వేగం పెంచాలని సంబంధిత అధికారులను, వివిధ సంఘాల నాయకులు సూచించారు.16 నుండి 59 ఏండ్లలోపు వాళ్ళు మాత్రమే అర్హులన్నారు.ఈఎస్ఐ, పీఎఫ్, ఈపీఎఫ్, లేని వారు అలాగే ఆదాయపు పన్ను పరిధిలోకి రాని అందరు అర్హులని తెలిపారు.ఈ కార్డు ద్వారా ప్రతి కార్మికునికి ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద మరణ అలాగే అంగ వైకల్య బీమా ఉచితంగా కల్పించబడుతుందన్నారు.కార్డు నమోదు ప్రక్రియలో ఎక్కడ కూడా రుసుమం చెల్లించవద్దన్నారు.అర్హత ఉన్న ప్రతి కార్మికునికి ఉచితంగా కార్డులు అందించాలని ఆదేశించారు.జిల్లాలో ప్రభుత్వరంగ, అనుబంధ శాఖలలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించే దిశగా నమోదు ప్రక్రియలో వేగం పెంచాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు.కార్డు పొందిన ప్రతి కార్మికుడు ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు సులువుగా అందుకునేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఆటో మొబైల్, రవాణా రంగం, చేతివృత్తులు, స్వయంఉపాధి, ప్రభుత్వ పథకాలు అమలు కానివారు, హమాలీలు, దుకాణాలు అలాగే వివిధ సంస్థలలో పనిచేసే వారు అర్హులని ప్రతి ఒక్కరు ఈ శ్రమ్ కార్డు ద్వారా సామాజిక భద్రత పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. మంజుల, కార్మిక శాఖ అధికారి ఎం.రాజు, జిల్లా అధికారులు, వివిధ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు పోటెత్తిన భక్తజనం

సైదన్నను దర్శించుకున్న ఎంపీలు,ఎమ్మెల్యే,కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-పాలకవీడు

పాలకవీడు మండలంలోని పవిత్ర జాన్‌పహాడ్ దర్గా ఉర్సు రెండో రోజు ఉత్సవాలకు శుక్రవారమూ భక్తజనం పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో దర్గా పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి.ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, ఉత్తంకుమార్ రెడ్డి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిలకు దర్గా ముజావర్లు ఘనంగా స్వాగతం పలికారు.పవిత్రగంధంతో దర్గా దర్శనం చేయించారు.ఉదయాన్నే హైదరాబాద్ వక్ఫ్‌బోర్డ్ నుంచి వచ్చిన గ్రంధాన్ని పూజల అనంతరం ఆనవాయితీగా జాన్‌పహాడ్, కల్మెట్‌తండా, చెరువుతండా గ్రామాల్లో పోలీసుల బందోబస్తు మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు.వేలాదిగా హాజరైన భక్తులు పవిత్రగ్రంధాన్ని అందుకోవడానికి పోటీపడ్డారు.సాయంత్రం పవిత్రగ్రంధాన్ని దర్గాలోని సమాధులపైకి ఎక్కించారు.మరోవైపు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీల నుండి వచ్చే భారీ వాహనాలు, లారీలను 24 గంటల పాటు నిలిపివేశారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దర్గా నలువైపులా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసి వాహనాలను కట్టడి చేశారు.మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ డిపోల నుండి ప్రత్యేకంగా దర్గాకు స్పెషల్ బస్సులను నడిపించారు. ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 వేల మందికి పైగా భక్తులకు దర్గా వద్ద కందూరు చేసి భోజనాలు పెట్టారు.ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, వైద్య ఆరోగ్యశాఖ, మండలంలోని పలు గ్రామాల నుండి పారిశుధ్య కార్మికులు హాజరై ఇక్కడ వారి సేవలందించారు.మొత్తంగా అన్ని శాఖల అధికారులు సమన్వయమై, ఉత్సవాలను విజయవంతం చేశారు.స్థానిక డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో మంచినీటి వసతి, టెంపరరీ టాయిలెట్స్, రోడ్ల మరమ్మతుల్లాంటి సేవలు దర్గా ఉత్సవాలకు అందాయి.దర్గా పరిసర వీధులు మహిళలు పిల్లలు పెద్దలతో కోలాహలంగా మారింది.సూర్యాపేట జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అప్పిరెడ్డి, ఓజో ఫౌండేషన్ చైర్మెన్ పిల్లుట్ల రఘు, ఆర్డీవో వెంకారెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, జెడ్పీటీసీ బుజ్జి మోతిలాల్, ఎంపీపీ గోపాల్‌నాయక్, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు సుబ్బారావు, స్థానిక సర్పంచ్ గౌరి, ఎంపీటీసీ విజయవెంకట్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ సత్యానారాయణరెడ్డి, ఎంపీటీసీలు దొంగల వెంకటయ్య, మీసాల ఉపేందర్, నీమానాయక్, బెల్లంకొండ నర్సింహారావు, స్థానిక కాంగ్రెస్ నాయకుడు నాగయ్య తదితరులు దర్గాను దర్శించుకున్నారు.











దళితబంధు కాదు..అవినీతి బంధు

- దళితబంధు రాబంధులు
- బీసీబంధు, గిరిజనబంధు, మైనార్టీబంధు అమలు చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం పటిష్టంగా చేపట్టిన దళిత బంధు పథకంలో అధికార పార్టీ నాయకులతో పాటు కిందిస్థాయి అధికారి నుండి పై స్థాయి అధికారి వరకు దళితబంధు పథకం దళారీబంధుగా మారిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న ఆరోపించారు. మండలకేంద్రంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.అనంతరం విలేకర్లతో మాట్లాడారు.దళితబంధు పథకం దళితుల కన్నా దళారులకే ఎక్కువ లాభం చేకూరిందన్నారు.ఈ స్కామ్ ఒక స్కీమ్‌గా మారిందన్నారు.అధికార పార్టీ నాయకులు అధికారులు కుమ్మక్కై దళితులకు చెందాల్సిన రూ.10 లక్షలకు బదులు రూ.6 లక్షల నుండి రూ.7 లక్షలు మాత్రమే దళితులకు ఇచ్చి అన్యాయం చేస్తున్నారన్నారు.ప్రతి గ్రామం నుండి రూ. కోటి నుండి రూ.2 కోట్ల వరకు దండుకుంటున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇస్తానన్న మూడెకరాల భూమి ఇవ్వకుండా మోసం చేస్తుందని, దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని మంత్రి పదవులు కూడా ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు దళిత బందులో కూడా దళితులను మోసం చేసిందని విమర్శించారు. దళిత బంధు పథకం పై విచారణ జరిపి దళితుల నుండి దండుకున్న డబ్బులను దళితులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా బీసీబంధు, గిరిజనబంధు, మైనార్టీ బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు.దళితబంధులో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దేశంతో దళిత బంధు పథకాన్ని ప్రవేశపెడితే తిరుమలగిరి మండలంలో అవినీతి బంధుగా మారిందన్నారు.దళిత బంధు పథకం కింద ప్రతి దళితునికి 10 లక్షల రూపాయల ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించి తిరుమలగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించిన దోపిడీ ఆగడం లేదన్నారు.ప్రతి లబ్దిదారునికి ఆరు నుండి ఏడు లక్షల వరకే అందజేస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు పథకం దళారుల మయంగా మారిందన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకులు చింతకుంట్ల పరమేష్, పేరాల యాదగిరి, నగేశ్, ధనియాల శంభయ్యనాయుడు, పగిండ్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మెహబూబా సుభాని ఉర్సు

- పోటెత్తిన భక్తులు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని దూపహాడ్ గ్రామంలో భక్తులకు కులమతాలకతీతంగా కొలువుదీరిన మెహబూబా సుభానీ దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వాహకులు గోపగాని వెంకటేశం, గోపగాని హుస్సేన్, గురవయ్య, సైదులు, లక్ష్మీనారాయణ, గోపగాని సందీప్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ ఉత్సవాలకు మండలంతో పాటు వివిధ మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో దర్గా ప్రాంగణం భక్తులతో పోటెత్తింది నిర్వాహకులు నేరేడుచర్ల మండలం జాన్పహాడ్ దర్గా నుండి గురువారం రాత్రే పవిత్ర గంధాన్ని తీసుకువచ్చి వారి ఇంటి వద్ద ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.అనంతరం గ్రామంలో ఊరేగింపుగా గంధాన్ని భక్తుల కోలాహలంతో బాజాభజంత్రీల నడుమ దర్గా వద్దకు తీసుకురావడంతో భక్తులు ఒక్కసారిగా గంధాన్ని అందుకోవడం కోసం పెద్ద తోపులాట జరిగింది. మెహబూబా సమాధిపై పానశాల వేచి గంధాన్ని ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ముజావరి షేక్ సైదులు భక్తులకు పవిత్ర గ్రంధాన్ని అందించారు.అదేవిధంగా దర్గా వద్ద వెలిసిన నాగదేవతకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉర్సు సందర్భంగా తినుబండారాల షాపులు అధిక సంఖ్యలో వెలిశాయి. వివిధ గ్రామాలకు మండలాలకు చెందిన భక్తులు వారి మొక్కులో భాగంగా మేకలను, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుని బంధు మిత్రులతో విందులను ఆరగించారు. ఈ కార్యక్రమంలో టిపిపిసిసి కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు యాట ఉపేందర్, బెల్లంకొండ శ్రీరాములు, కుందురు వెంకట్‌రెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, పిన్నని సందీప్, గుంజ శివప్రసాద్, పాల్గొన్నారు.



పుప్పాల కృష్ణమూర్తికి బాలసాహిత్యంలో పురస్కారం

నవతెలంగాణ-కోదాడరూరల్

కోదాడ రచయితల సంఘం అధ్యక్షులు పుప్పాల కృష్ణమూర్తికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాయలం 2020వ సంవత్స రానికి గాను బాలసాహిత్యంలో ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించింది. వీరు 2019లో రాసిన 'వెన్నెల వాకిలి' బాలల కథల గ్రంథానికి గాను ఈ పురస్కారాన్ని ప్రకటించారు.ఈ అవార్డు కింది రూ.20,116, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో త్వరలో విశ్వ విద్యాలయంలో జరగనున్న కార్యక్రమంలో సత్కరించనున్నారు. కృష్ణమూర్తి ఇప్పటి వరకూ వెయ్యికి పైగా కథలు రాశారు. 17గ్రంథాలు ప్రచురించారు.వీటిలో 15గ్రంథాలు బాల సాహిత్యానికి సంబంధించినవే.2016లో ఇదే విశ్వవిద్యాలయం నుండి కీర్తి పురస్కారం అందుకున్నారు.పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారం, నారంశెట్టి బాలసాహిత్య పురస్కారం, చారుగుండ్ల ట్రస్టు నుండి ఏపీజే అబ్దుల్‌కలాం ఎక్సలెన్స్ అవార్డులు, పలు పురస్కారాలు అందుకున్నారు.30 ఏండ్లుగా సాహిత్యంలో కృషి చేస్తున్న కృష్ణమూర్తికి ఈ అవార్డు రావడం పట్ల కోదాడ రచయితల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, మంత్రి ప్రగడ భరతారావు, సంఘం సెక్రెటరీ మంగయ్య, కోశాధికారి శేకు శ్రీనివాసరావు, సాహితీమిత్రులు, కవులు, రచయితలు అధినందనలు తెలియజేశారు.వీరు మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.



సబ్బండకులాలకు స్వేచ్ఛను ఇచ్చిన గణతంత్ర దినం

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారథన్‌మహారాజ్

నవతెలంగాణ-సూర్యాపేట

భారత దేశంలో బీసీ,ఎస్సీ, ఎస్టీలతో పాటు సబ్బండ కులాలకు స్వేచ్ఛను గణతంత్ర దినోత్సవం ఇచ్చిందని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్‌మహారాజ్ అన్నారు.గురువారం రాత్రి గాంధీనగర్ మీదుగా పట్టణంలోని పూలే విగ్రహం వద్ద కు చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య ఆహ్వాన సభలో ఆయన ప్రసంగించారు.తెలంగాణ గడ్డమీద బీసీ, ఎస్సీ,ఎస్టీల స్వరాజ్యాన్ని స్థాపించేందుకే ఈ పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రను చేపట్టామన్నారు.10 శాతం లేని అగ్రకుల రెడ్డి, వెలమ దొరలు తెలంగాణలో ఏలడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ ,ఎస్టీలు ఈ రాష్ట్రాన్ని పరిపాలించడమే న్యాయమన్నారు.తెచ్చుకున్న తెలంగాణలో సబ్బండకులాల వాటా ఎంత అని ప్రశ్నించడానికే పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బలిపీఠం ఎక్కింది బీసీ,ఎస్సీ, ఎస్టీలయితే అధికారాన్ని అనుభవిస్తుంది మాత్రం కేవలం రెడ్డి, వెలమ దొరలేనని విమర్శి ంచారు.భారత భూభాగానికి బ్రిటీష్ వారి నుండి విముక్తి కలిగింది ఆగస్టు 15 అయితే దేశంలో నివసించే సర్వజనులకు మాత్రం విముక్తి కలిగిన రోజు జనవరి 26 గణతంత్ర దినోత్సవమన్నారు.జాతిపిత అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మహిళల గురించి, వికలాంగులు, కార్మిక కర్షకులు, సమస్త సబ్బండ వర్గాల గురించి హక్కులు అవకాశాలు పొందుపరిచి అందరిని విముక్తి చేశారని అందుకే సబ్బండ వర్గాల సామూహిక పుట్టినరోజు అని పేర్కొన్నారు.భారత రాజ్యాంగం ద్వారా ఒకేసారి అంబేద్కర్ కోట్ల మంది అణగారిన కులాలను అగ్రకుల ఆధిపత్య దోపిడీ దౌర్జన్యాల నుండి విముక్తి చేసిన నిజమైన దేశభక్తుడన్నారు.గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భారత రాజ్యాంగం, అంబేద్కర్ చిత్రపటాన్ని జెండా ఆవిష్కరణ సమయంలో ప్రతిచోటా ఏర్పాటు చేసి రాజ్యాంగ పీఠికను చదివించాలని డిమాండ్ చేశారు.భారత స్వాతంత్ర్యం, భారత గణతంత్రం రెండు వేర్వేరని, ఈదేశపరిపాలకులు ప్రజలకు ఎందుకు చెప్పడం లేదని మండిపడ్డారు.ఈ పాలకులు భారత రాజ్యాంగాన్ని అందులో ఉన్న ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు తెలపకుండా మోసం చేస్తున్నారని తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో స్వరాజ్య పాదయాత్ర ఇన్‌చార్జి లక్ష్మణ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కిరణ్, కుమారి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ జహంగీర్, ఆలిండియా మిల్లీ కౌన్సిల్ పట్టణ అధ్యక్షులు,ముస్లిం మైనార్టీ నాయకులు, మౌలానా ముఫ్తీ అస్రార్ నోమిని,బీసీ నాయకులు నాగయ్య,రజాక్, పుల్లయ్యగౌడ్, ఎస్టీ సంఘం జిల్లా నాయకులు నాగేందర్‌నాయక్, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రవీణ్, డీఎస్పీ జిల్లా నాయకులు జమదగ్ని, రాము, నరేష్, శ్రీనివాస్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

కొదమగుండ్ల నగేష్‌ను పరామర్శించిన ఎంపీ

నవతెలంగాణ-నేరేడుచర్ల

సీపీఐ(ఎం)పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ తండ్రి కొదమగుండ్ల వీరయ్య శుక్రవారం ఉదయం 10 గంటలకు అనారోగ్యంతో మరణించారు.విషయం తెలుసుకున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొదమగుండ్ల నగేష్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసు కున్నారు.ఆయన తండ్రికి నివాళులర్పిస్తూ ఆయన్ను పరామర్శించారు.ప్రత్యక్షంగా పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొనతం చిన్నవెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాష్, రణపంగ నాగయ్య ఉన్నారు.


ఉత్తమ అవార్డు అందుకున్న 108 పైలెట్

నవతెలంగాణ-అర్వపల్లి

74వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలకేంద్రానికి చెందిన 108 పైలెట్ వల్లాల సత్యనారాయణకు అతనితో పాటు కాసోజు శంకర్ 108 సర్వీసులు పనిచేసినందుకు రిపబ్లిక్ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ అవార్డును అందజేశారు.ఎస్సీ నసీరుద్దీన్, సూర్యాపేట జిల్లా మేనేజర్ సోమేశ్వర్ నగర్ ప్రశంసాపత్రాలను వీరికి అందజేశారు. ఉత్తమ అవార్డులను వల్లాల సత్యనారాయణ ఐదుసార్లు ఉత్తమ పైలేట్‌గా అవార్డును అందుకున్నారు.



అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రిభువనగిరి
4
శనివారం 28 జనవరి 2023



వడపర్తిలో కంటి వెలుగు



నవతెలంగాణ -భువనగిరిరూరల్

మండలంలోని వడపర్తి గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్ , జెడ్పీటీసీబీరు మల్లయ్య , సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి , ఉప సర్పంచ్ బొబ్బిలి మణెమ్మ , వార్డు సభ్యులు తుమ్మల కవిత , పాండాల వెంకటేష్ , జూపల్లి మౌనిక , ఎలిమినేటి రామకృష్ణారెడ్డి , మెడబోయిన వేణు , ఎర్ర మహేష్ , ముదుగుల ఎల్లమ్మ , తుమ్మల సత్యలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచాలి

నవతెలంగాణ -ఆలేరురూరల్



మండలంలోని పటేల్ గూడెం గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ పులగం పద్మ యాదిరెడ్డి నర్సరీ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్యాకెట్లు మట్టితో నిర్మించిన వాటిలో విత్తనాలు వేసి వాటిని మొలిచే విధంగా చూడాలని వనసేవకురాలకు సూచించారు . ఈ కార్యక్రమంలో ఏఈఓ పవన్ కుమార్, వన సేవకురాలు సంధ్యారాణి ,సోమక్క ,రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి అమలు చేయాలి

- **సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి**

నవతెలంగాణ- ఆలేరుటౌన్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో రిటైర్ అయిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు గ్రాట్యుటి చట్టాన్ని అమలుచేసి, చివరి నెల వేతనంలో సగం వేతనం పెన్షన్‌గా నిర్ణయించాలని సీఐటీయూజిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి టీచర్లు శుక్రవారం మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసులో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్రం పెంచిన వేతనాలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల ఏరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు బూరుగు



ఆలేరుటౌన్

స్వప్న, సీఐటీయూ పట్టణ కన్వీనర్ మొరిగాడి రమేశ్, నాయకులు రమ, లక్ష్మి, అనురాధ, శ్యామల, శోభ, మంజుల, భాగ్య, రజిత,పద్మ, ప్రభావతి, ఫాతిమ, మాధవి, సునిత, కళ్యాణి, రాజేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి

భువనగిరి : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో రిటైర్ అయిన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు గ్రాట్యుటి చట్టాన్ని అమలుచేసి, చివరి నెల వేతనంలో సగం వేతనం పెన్షన్ గా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం భువనగిరి సీడీపీఓ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసులో సీపీడీఓ స్వరాజ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు రమాకుమారి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు తూటి వెంకటేశం, నాయకులు ప్రమీల, షాహెద, రుక్మిణి, వరమ్మ, వసంత, రాధిక, హేమలత, భాగ్య, పద్మాబాయి, నాగమని, రమ్య అనిత పాల్గొన్నారు.

అంగన్ వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి

రామన్నపేట : అంగన్ వాడీ ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.పాషా ప్రభుత్వాన్ని



రామన్నపేట

డిమాండ్ చేశారు. అంగన్ వాడీ టీచర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంకోసం రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా శుక్రవారం రామన్నపేట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్ వాడీ ఉద్యోగులతో కలసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా70 వేల మంది అంగన్ వాడీ ఉద్యోగులు పనిచేస్తుంటే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా కనీస వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. 1972 గ్రాడ్యుటీ చట్టం అమలు చేయాలని, 2022 మే నెలలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. దీని మూలంగా వయసు పైబడిన వారందరికీ తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ధర్నా చేస్తున్న టీచర్లకు మాజీ సర్పంచ్ బోయిని ఆనంద్, పల్లివాడ ఉప సర్పంచ్ కల్లూరి నగేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ ఉద్యోగులు ఎస్.వాణి.కె.సునిత, ఎ.విజయలక్ష్మి, కె.అరుణ, సంద్యారాణి, కల్పన, రేణుక, యం చంద్రకళ, ఐలమ్మ, మల్లమ్మ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వర్క్ సైట్ పాఠశాలల్లో చదివే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- **కలెక్టర్ పమేలా సత్పతి**

నవతెలంగాణ- భూదాన్‌పోచంపల్లి

వర్క్ సైట్ పాఠశాలల్లో చదివే పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇటుక తయారీ కేంద్రాల యజమానులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం పోచంపల్లి మండలం పెద్దగూడెం గ్రామంలో ఒరిస్సా నుంచి వచ్చిన ఇటుకల తయారీ కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన రెండు వర్క్ సైట్ పాఠశాలలను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులకు బుక్స్, బ్యాగులు అందజేశారు. ఇటుక తయారీ కేంద్రాల యజమాన్యం ఈ రెండు స్కూళ్లను ఏర్పాటు చేసింది. దీనికోసం ఒరిస్సా నుండి ఇద్దరు టీచర్లను రప్పించినట్లు తెలిపారు. కలెక్టర్ విద్యార్థులతో ఒరియా భాషలో మాట్లాడారు. బాగా చదువుకోవాలని అన్నారు.ఇతర ప్రాంతాల నుండి వస్తున్న ఇటుక తయారీ కార్మికుల పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలని, విద్యా సౌకర్యాలు కల్పించాలని, పిల్లలతో పని చేయించవద్దని ఆదేశించారు. ఎంపీడీవో, తహసీల్దార్ తరచూ పాఠశాలలను పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మెన్ జయశ్రీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎంపీడీవో బాలశంకర్, తహసిల్దార్ వీరాబాయి, గ్రామ సర్పంచ్ పద్మా రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రం పరిశీలన

మండలంలోని జగత్ పల్లి గ్రామంలోని శుక్రవారం కంటి వెలుగు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన.కంటి వెలుగును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య బృందాలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. అర్హులందరికీ కండ్లద్దాలు అందజేయాలని వైద్య బృందానికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వీరబాయి, ఎంపీడీఓబాల శంకర్, వైద్యులు డాక్టర్ యాదగిరి, బోయిన లింగయ్య, ఇట్టబోయిన యాదయ్య ,బసవలింగం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడికేంద్రంలో కలెక్టర్ తనిఖీ

భువనగిరిరూరల్ : మండలంలోని అనంతారం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ప్రతి శుక్రవారమూ జరిగే సభను కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. యూనిషేఫ్ స్టేట్ లీడ్స్ వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం సభ



ద్వారా గర్భిణులు, బాలింతలకు ఎలాంటి సమస్యలు రాకుండా దోహదా పడుతుందన్నారు. గర్భిణులకు శ్రీమంతం, చిన్న పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల వెంకట స్వామి యాదవ్, గ్రామ సర్పంచ్ చిందం మల్లిఖార్జున్, యూనిసిఫ్ స్టేట్ లీడ్స్ శివాల్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, నర్సింహా రావు, ఐసీడీఎస్ జిల్లా, మండల అధికారులు , గ్రామ ఉప సర్పంచ్ విట్టల్ వెంకటేష్ , పంచాయతీ సెక్రెటరీ నర్సింగ్ రావు, వార్డు సభ్యులు, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

నవ తెలంగాణ -భువనగిరి రూరల్

మండలంలోని అనాజీపురం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణానికి సర్పంచ్ ఏదునూరి ప్రేమలత మల్లేశం, ఎంపీటీసీ గునుగుంట్ల కల్పన శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన భువనగిరి ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి కి గ్రామ పంచాయతీ పాలకవర్గం , గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైలారం వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు కొత్తపల్లి పద్మ, గంగనబోయిన లక్ష్మి, బొల్లేపల్లి భారతమ్మ, శ్రీరామ్ బాలకృష్ణ, గోగు శ్రీనివాస్, పిట్టల వెంకటేశం, పాలసంగం చైర్మన్ పాండు, గ్రామస్తులు వెలిశాల కృష్ణ, నానాపురం నాగయ్య, సుజాత పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవ తెలంగాణ- భువనగిరి రూరల్



మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు నల్ల బిక్షపతి మృతిచెందగా, ఆయన అంత్యక్రియలకు శుక్రవారం కుటుంబసభ్యులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు గ్రామ సర్పంచ్ తంగెనపల్లి కల్పన శ్రీనివాస్ చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కోట పెద్ద స్వామి, మండల ఉపాధ్యక్షురాలు నల్ల లహరి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు రేగు శ్రీశైలం, ఉప సర్పంచ్ జార్జి కమలమ్మ సురవికృష్ణ, కంచి మహేషు, శోకం కృష్ణమూర్తి, రేగు సిద్ధమ్మ , నరసయ్య, సుదర్శన్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన రైతు నల్ల బిక్షపతి అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన కుటుంబానికి చందుపట్ల బ్యాంకు తరపున రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని బ్యాంకు చైర్మెన్ మందడి లక్ష్మి నరసింహ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మెన్ ఎలిమినేటి మల్లారెడ్డి, డైరెక్టర్లు తోటకూరి శంకరయ్య, చింతల వెంకటరెడ్డి, నల్ల లక్ష్మి, బ్యాంకు సీఈవో దంతూరి నరసింహ, నల్లమాసు రాములు, గుర్రం నాగరాజు, గజరాజు , సత్తయ్య, గాదం నాగార్జున పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో బండ కిష్టయ్య, కోనేటి మంగ లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోలు చొప్పున బియ్యం పంపిణీచేశారు. .ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షులు బాల్ద శ్రీకాంత్ బీర్ల ఫౌండేషన్ డైరెక్టర్ మరల సిద్దేశ్వర,సీనియర్ నాయకులు గోపగోని బాలయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కోటోజు శ్రీనివాసు, బాల సత్తయ్య, ఎర్ర నగేష్ ,మర్ల స్వామి, విజయ్ కృష్ణ సోషల్ మీడియా ఇంచార్జ్ జక్కుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన బుశిపాక ముత్తయ్య ఇటీవల మృతి చెందగా గురువారం ఆ కుటుంబానికి వైస్ ఎంపీపీ బుశిపాక లక్ష్మీ మారయ్య 50 కిలోల బియ్యం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడునేర్లకంటి మత్స్యగిరి రూ. వెయ్యి కార్యదర్శి పైళ్ల వెంకట్ రెడ్డి రూ.వెయ్యి, యూత్ అధ్యక్షుడు జిల్లాల మచ్చేందర్ రెడ్డి రూ.500 ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన గోలి జానీ అనారోగ్యంతో మృతి చెందగా మాజీ సర్పంచ్ కడమంచి వస్తాద్ ఆ కుటుంబాన్ని పరామర్శించి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వస్తాద్ రూ.3 వేలు, కర్నె వీరేశం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బుశిపాక సైదులు,మెరుగు యాదగిరి, బుశిపాక సుజాత, సైదులు, బీఆర్ఎస్ దాచారం గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు జినుకల యాదగిరి, చిల్లర వీరయ్య, బుంగ నరేందర్, కప్పల లింగయ్య, ఆకుల దయాకర్ తదితరులు పాల్గొన్నారు

రామన్నపేట : మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన చల్లమల్ల వెంకటేశం అనారోగ్య కారణాలవల్ల మృతి చెందడంతో పదవ తరగతి 2006 -07 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శుక్రవారం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వెంకటేశం భార్య బాగ్యమ్మకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వేముల సైదులు, పాపని నరసింహ, నర్మద, క్లాస్ మేట్స్ కన్నెబోయిన లింగస్వామి, అంకిరెడ్డి ఉపేందర్, గుండెపురి రాజు, కోట పరమేష్, పోలగోని జాని, వేముల స్వామి, తెడ్ల మధు తదితరుల పాల్గొన్నారు.

త్రిబుల్‌ఆర్ రోడ్డు వద్దని మోకాళ్లపై నిలబడి నిరసన

నవతెలంగాణ - భువనగిరి

త్రిబుల్ ఆర్ రోడ్డు వద్దంటూ భువనగిరి మున్సిపల్ పరిధిలోని రాయగిరి గ్రామ రైతులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చలు జరుపుదామంటూ ఆర్డీవో ఇచ్చిన పిలుపుమేరకు బాధితులు ఆర్డీఓ కార్యాలయాలకు చేరుకున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ మాట్లాడారు. కోట్లాది రూపాయలు విలువ చేసే భూమిని త్రిబుల్ ఆర్ పేరుతో సేకరించడం బాధాకరమన్నారు. . ఇప్పటికే పలుమార్లు తహశీల్దార్ నుండి ఉన్నత అధికారుల వరకు



వినతి పత్రాలు అందజేశామన్నారు. అయిన మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-అడ్డగూడూర్

ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించుకోవాలని ఎంపీపీ దర్శనాల అంజయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెల్దేవి గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అందత్వ నివారణకు కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణయ్య, ఎంపీడీవో చంద్రమౌళి , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ పిల్లి శ్రీకళ సుందర్, ఉప సర్పంచ్ రామచంద్రు , పంచాయతీ సెక్రటరీ శ్రీశైలం , వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది , ఏఎన్ఎంలు , ఆశ వర్కర్లు , గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని కొత్తజాల గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని శిబిరాన్ని సర్పంచ్ ఠాగూర్ ధర్మేందర్ సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రామస్తులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, రాజాపేట ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భరత్, డాక్టర్ కవిత, డీఈవో మణికంఠ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రామన్నపేట

శ్రీనివాస్,ఆంజనేయులకు సన్మానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మున్నూరు కాపు సంఘం నాయకులు చిరిగే శ్రీనివాసు , పట్టణ ప్రధాన కార్యదర్శి వెలగల ఆంజనేయులను మండల కేంద్రంలో సంఘం కార్యాలయం ఆవరణలో సభ్యులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎలుగల స్వామి, తోట మల్లయ్య, ఎలుగల పాపయ్య,పత్తి రాములు,ఎలుగల కుమారస్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కుక్కర్లు పంపిణీ

నవతెలంగాణ -వలిగొండ రూరల్

మండలంలోని గోకారం గ్రామంలోని మూడు అంగన్వాడీ సెంటర్స్‌కు సర్పంచ్ తూర్కపల్లి మాధవి సురేందర్ తన సొంతనిధులతో కుక్కర్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దేశపాక మైసమ్మ వార్డ్ మెంబర్స్ శనిగరపు పాండు, మాజీసర్పంచ్ మద్దెల రాజయ్య, గుండు దానయ్య, సిరిపంగి శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం పోరాడుదాం

- **వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కకుమారి**

నవతెలంగాణ -భువనగిరి రూరల్

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మికులంతా సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కకుమారి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఆసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి , ఇంటింటికి తిరిగి వ్యవసాయ కూలీలతో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తోందన్నారు. పనుల సంఖ్య తగ్గిస్తూ కొత్త కొత్త విధానాలు జీవోలు తెస్తూ పనిచేసిన కూలీలకు వారం వారం డబ్బులు చెల్లించడంలేదన్నారు.



ఈ కార్యక్రమంలో కొండ శంకరమ్మ,దేశెట్టి పద్మమ్మ , పులోల్ల ఇందిరమ్మ, కొండ లక్ష్మమ్మ, కొండ సావిత్రి, ఎంకర్ల మాధవి, మెరుగు లక్ష్మమ్మ పల్లెర్ల ప్రమీల, కొండమడుగు కమలమ్మ, కొండమడుగు ఎల్లమ్మ , కొండ మహేశ్వరి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- రామన్నపేట

తెలంగాణప్రయివేటు ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీల ను శుక్రవారం స్థానిక రహదారి బంగ్లాలో రామన్నపేట ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎటెల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రిషన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాననీ అన్నారు. ప్రతి ఒక్కరూ యూనియన్ గుర్తింపు కార్డు, లేబర్ కార్డులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు కంభంపాటి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు బారాల స్వామి, చిట్యాల మండల అధ్యక్ష కార్యదర్శులు దేశపాక యాదగిరి, ఉయ్యాల శివ, రామన్నపేట ప్రధాన కార్యదర్శి ఎండి.యూసుఫ్, కోశాధికారి ఎండి జావిద్, సభ్యులు పోనుగోటి లింగారావు, కందుల నరసింహ, నోముల లింగస్వామి, ఆళ్ళ బాలకృష్ణ, బందెల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాక గ్రామంలో మైనార్టీ మండల అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో బీర్ల ఐలయ్య క్యాలెండర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఉమర్, ఖాసిం, సలీం, రసూల్, అబ్బాస్, వికారుద్దీన్ ,మహబూబ్, రహమత్ ,అలీ, అజ్ ,అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లిలో చోరీ

నవతెలంగాణ - అడ్డగూడూర్

ఇంట్లోచోరీ జరిగిన సంఘటన మండలంలోని కంచనపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.... కంచనపల్లి గ్రామంలో రిటైర్డ్ టీచర్ ఎల్లముల అవిలయ్య ఆరోగ్యరీత్యా హాస్పిటల్ లో చూయించుకోవడం కోసం గురువారం సాయంత్రమే హైదరాబాద్ కు వెళ్లారు. ఇదే అదునుగా భావించి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న బీరువాని పక్కనే ఉన్న చెరువులోకి తీసుకొని వెళ్లి బీరువాని రాయితో పగలగొట్టి అందులో ఉన్న రెండున్నర తులాల నెక్లెస్ గొలుసుని, 50వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్పెషల్ టీం ని రప్పించి ఎంక్వయిరీ ని ప్రారంభించారు. ఈ మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

జీపీకార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలి

నవతెలంగాణ -భూదాన్ పోచంపల్లి

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు ప్రభుత్వాన్ని కోరారు. వేతనాలు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మల్టీపర్పస్ పేరుతో కార్మికులతో వెట్టిచాకి చేయించుకుంటూ వారికి చాలీచాలని వేతనాలను ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో నరసింహ, గంగయ్య ,శంకరయ్య నరసింహ, బాబు యాదమ్మ పాల్గొన్నారు .

పెరటికోళ్ల పెంపకంతో ఉపాధి

నవతెలంగాణ-మోత్కూరు



పెరటి కోళ్ల పెంపకంతో ఉపాధి పొందవచ్చని మున్సిపల్ చైర్ పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి అన్నారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో 9 మంది ఎస్సీ రైతులకు మంజూరైన కోడి పిల్లల యూనిట్లను గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో యూనిట్ లో 25 కోడి పిల్లలు ఉంటాయని, సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, కమిషనర్ సి.శ్రీకాంత్, వెటర్నరీ డాక్టర్ వల్లాల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నవతెలంగాణ- ఆలేరురూరల్ .

యూత్ కాంగ్రెస్ మండల నాయకులు నియోజకవర్గం ఉపాధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ నానమ్మ ఇటీవల మృతి చెందింది. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ,జెడ్పీటీసీ కుడుకుల నగేష్ శుక్రవారం పరామర్శించారు. ప్రగడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు గౌస్ ,పార్టీ నాయకులు రత్నాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ -సంస్థాన్ నారాయణపురం

తెలంగాణ మోడల్ స్కూల్ లో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం కోరారు.6వ తరగతిలో 100 సీట్లు,7 నుంచి 10 తరగతులలో ఖాళీ అయిన సీట్లకు దరఖాస్తులు చేసుకునే అవకాశం 2023 జనవరి 10 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఉందన్నారు.Telanganas.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 16న ఉదయం 6వ తరగతి విద్యార్థులకు, అదే రోజు మధ్యాహ్నం 7 నుంచి 10 తరగతి విద్యార్థులకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిస్టరి అతిథి లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ- రామన్నపేట

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరులో హిస్టరి అధ్యాపకుడి ఖాళీ(1)ని అతిథి అధ్యాపకుడితో భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వ (ఐడి) డిగ్రీ కళాశాల రామన్నపేట ప్రధానాచార్యులు డా.బెల్లి యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ లో 55శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పోస్టులకు 50శాతం మార్కులుగల ఎస్‌సీ, ఎస్టీ అభ్యర్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. గెస్ట్ అధ్యాపకుడి ఎంపికలో కళాశాల విద్యా కమీషనర్ ఆదేశానుసారం అభ్యర్థుల అదనపు అర్హతలకు, బోధనానుభవానికి ప్రాధాన్యత ఉంటుందని, దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట కార్యాలయంలో ఈ నెల 31 లోగా అందజేయాలని పేర్కొన్నారు. గఫిబ్రవరి 2న ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటకు హాజరుకావాలని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-చింతపల్లి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్ఎస్‌జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు.శుక్రవారం 'ఊరు -మన ప్రభుత్వం-మన పథకాలు' కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలం బోటిమిది తండాలో రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు,రూ.20లక్షలతో చేపడుతున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణపనులకు ఎమ్మెల్యే శంకు స్థాపన చేశారు.ఈ సందర్భంగా బోటిమిది తండాలో ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....సీఎం కేసీఆర్ వచ్చాక ఆసరా పెన్షన్లు, నిరంతర ఉచిత కరెంటు, ఆడపిల్ల పెండ్లికి ఆర్థికసాయం అందించడం



జరుగుతుంది అని ఆయన తెలిపారు.తెలంగాణలో అన్ని వర్గాలకు మంచి చేయడమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి,స్థానిక సర్పంచ్ నేనావత్ జ్యోతి చందర్‌నాయక్,ఉప సర్పంచ్ కిషన్‌నాయక్,ఎంపీటీసీ నేనావత్ సునీత వసంత్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులఫోరం మండల అధ్యక్షులు గున్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రాజు,డీఈ జీవన్‌సింగ్, బీఆర్ఎస్ మండలప్రచార కార్యదర్శి వింజమూరి రవి,బీసీ సెల్ మండల అధ్యక్షులు అండేకార్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు నట్వ గిరిధర్,మాస భాస్కర్,ఉడుత అక్రం యాదవ్,ముద్దం కృష్ణయ్య,ముద్దం జోగయ్య,బాదేపల్లి పులిరాజు, కుంభం శ్రీశైలంగౌడ్,నాదిరి శ్రీశైలం,నేనావత్ సుమన్‌నాయక్, కృపాకర్,కేతావత్ జగన్‌నాయక్, ఉప్పలయాదయ్య,యం.డి.ఖాలేద్, సిమర్ల శ్రీను యాదవ్,శంకర్, రమేష్ నాయక్,రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బంది నియామక దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో జపాన్ ప్రభుత్వ పథకం, స్పెసిఫైడ్ స్కిల్డ్ (ఎస్ఎస్‌డబ్ల్యూ) కింద జపాన్‌లో పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణా, నియామకం కోసం నేడు జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నర్సింగ్ గ్రాడ్యుయేషన్, జీఎన్ఎం డిప్లొమా పూర్తి చేసి 22 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఆసక్తి గల అభ్యర్థులు స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకావాలన్నారు.ఉదయం 10 గంటలలోపు రిపోర్ట్ చేయాలని సూచించారు.ఎంపికైన అభ్యర్థులు జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు అందించబడుతాయని, అర్హత సాధించిన వారికి నెలకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు సంపాదించవచ్చని పేర్కొన్నారు.పూర్తి వివరాలకు 9951909863, 832860223 నెంబర్లను,http://www.tomcom.telangana.gov.in సందర్శించాలని సూచించారు.

ప్రపంచానికి వెలుగునిచ్చిన థామస్ ఎడిషన్

నవతెలంగాణ-సూర్యాపేట

థామస్ అల్వాయి ఎడిషన్ బల్బును కనిపెట్టి ప్రపంచానికి వెలుగునిచ్చారని తెలంగాణ ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.థామస్ అల్వాయి ఎడిషన్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్.ఆర్.ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఎలక్ట్రిషన్ డేలో ఆయన మాట్లా డారు. విద్యుత్ కాంతులను తెలంగాణ రాష్ట్రంలో 24 గంటలు కరెంటు ఇస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ మిత్రులకు మంత్రి అండదండలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తోటశ్రవణ్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వరిపల్లిశంకర్, ప్రధానకార్యదర్శి నల్లకుంట్లసందీప్, తాపీ మేస్త్రి డివిజనల్ అధ్యక్షులు నర్సయ్య, పట్టణఅధ్యక్షులు మెహబూబ్ అలీ, ప్రధాన కార్యదర్శి సోమయ్య, ఎలక్ట్రీషియన్ యూనియన్ సభ్యులుపాల్గొన్నారు.



గుడిపల్లి నూతన ఎస్ఐగా రంజిత్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

గుడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎ.రంజిత్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇతను నల్గొండ జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ ఐ పీ.వీర బాబు గౌడ్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉండే విధంగా,రోడ్డు ప్రమాదాలు జరగకుండా హైదరాబాద్ నాగార్జునసాగర్ ప్రధాన రహదారి పై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి నివారణ చర్యలు చేపడతాం అన్నారు నూతన ఎస్ఐకి గుడిపల్లి పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- **నిరసనకు దిగిన సర్పంచ్**

నవతెలంగాణ-మాదుగులపల్లి

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది.ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు సభ్యులు పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. అర్హులైన పలువురికి ఆసరా పింఛన్లు రావడం లేదని,ఎందుకు మిస్సయ్యాయో అధికారులు సమాధానం చెప్పాలన్నారు.చిరుమర్తి గ్రామంలో మూడేండ్లకింద పల్లె ప్రకృతివనం కోసం ఇద్దరు రైతులు వారి సొంత భూమి నాలుగుగుంటలు ఇవ్వగా వారికి వేరే చోట గ్రామపంచాయతీ ప్లాట్లు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారని, ఇప్పటివరకు ఆ గ్రామస్తులకు ఒప్పందం ప్రకారం నాలుగు గుంటల భూమి అధికారులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీపీ జోక్యం చేసుకొని మూడు నాలుగు రోజుల్లో ఇట్టి సమస్యకు ఒక పరిష్కారం చూపిస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.ఈ సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సైదులు డిమాండ్ చేశారు. సమావేశానికి అధికారులు రాకపోవడంతో ప్రజాప్రతినిధులు వచ్చి ఏం చేయాలో వారి సమస్యలకు ఎవరికి విన్నవించాలని అయోమయంలో ప్రజాప్రతినిధులు ఉన్నారని తెలిపారు.మండలంలో ప్రధాన సమస్య విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్ల గ్రామాలలో కరెంట్ లైన్ సరిగా లేకపోవడం ట్రాన్స్ఫార్మర్ పునరుద్ధీకరణ చేయక రైతులు ఇబ్బందులు పడుతున్న పలుమార్లు ఫోన్‌లో ద్వారా విద్యుత్ శాఖ



అధికారులకు,లైన్‌మెన్లకు తెలియజేసినా ఫలితం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే గ్రామాలలో రైతులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈసమావేశంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మోషన్ హలీ, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు దశరథ, కత్తి కనకారెడ్డి,సలీం, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, సింగం శివ, సైదులు, ఆగా అఫ్జల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎం చొరవతోనే ఆర్టీసీ బలోపేతం

- **శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి**

నవతెలంగాణ-మిర్యాలగూడ

సీఎం కేసీఆర్ చొరవతోనే ఆర్టీసీ బలోపేతం అయ్యిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిర్యాలగూడ టి.ఎస్.ఆర్.టి.సి బస్ డిపోకు కొత్తగా మంజూరు చేసిన 21 బస్సులను శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో తీసుకొచ్చారని చెప్పారు రాష్ట్రంలోనే నల్గొండ రీజియన్ మిర్యాలగూడ డిపో మూడో స్థానంలో ఉందని చెప్పారు కార్మికులు ఇదే స్ఫూర్తితో ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలని సూచించారు. ప్రయాణికుల సౌకర్యార్థం డిపోకు కొత్త బస్సులు అందించినట్లు తెలిపారు. కార్గో సేవల ద్వారా కూడా ఆర్టీసీకి ఆదాయం వస్తుందని చెప్పారు. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణికులు ప్రయాణం చేసి సురక్షితంగా ఇంటికి చేరుకొని సమస్యకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ధనవత్ చిట్టిబాబు నాయక్, నాయకులు నూకల హనుమంత్ రెడ్డి, షైక్ మదార్ బాబా, అన్నభీమోజు నాగార్జున చారి, డిపో మేనేజర్ పాల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



న్యూట్రిషన్‌తోనే ఆరోగ్యం

నవతెలంగాణ-అర్వపల్లి

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు న్యూట్రిషన్ తీసుకోవాలని ఎంపీటీసీ కనుకు పద్మ శ్రీనివాస్,దేవాలయ చైర్మెన్ చిల్లంచర్ల విద్యాసాగర్ కోరారు శుక్రవారం అరవపల్లిలో సాయి వైశాలి న్యూట్రిషన్ సెంటర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చినపాక మణిరత్నం, గండమల్ల ఎల్లయ్య,వేణు, సుధాకర్, నాగు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

మండలపరిధిలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు, సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు.ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసిఆహ్వానించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు మూడెం గోపిరెడ్డి, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, గ్రామఅధ్యక్షుడు ఆవుల వెంకటయ్య, గూడెపుబ్రహ్మం, గుండు చిన్నసైదులు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతిలో మెట్ట వరిసాగు

నవతెలంగాణ-మాదుగులపల్లి

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధునాతన పద్ధతిలో మెట్ట వరి సాగును మండలంలోని ఇందుగుల గ్రామంలోని కట్ట దామోదర్‌రెడ్డి వ్యవసాయ భూమిలో శుక్రవారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ వీరస్వామి మాట్లాడుతూ యూరియా, పొటాష్, అడుగుపిండి కలిపి తయారుచేసిన గుళికలను మెట్ట సాగు పద్ధతిలో సుమారు 8 నుండి 10 అంగుళాల భూమిలో వేయడంతోపాటు పై భాగంలో మెట్ట వరి సాగు పద్ధతిలో మూడు అంగుళాలలో విత్తనాలు వేయలి దీనితో భూమిలో పెట్టిన గులకల గుళికల ద్వారా మొక్కకు సరిపడా



పోషకాలు గుళికలు అందించి మంచి దిగుబడి లభిస్తుందని రైతుకు అడుగుపిండి, పొటాష్, యూరియా భూమిలో వేసే అవసరం లేదని ఆయన అన్నారు అనంతరం రైతు కట్టా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నూతన పద్ధతిలో వ్యవసాయం చేయడం రైతులు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటర్ సుబ్బు సింగ్, రమేష్, రైతులు జెర్రీపోతుల వెంకన్న, చింతపల్లి సీతారాములు, కొడదల సైదులు, ఇండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం విద్యార్థుల భవిష్యత్‌కు దోహదం

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆలిండియా సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు మద్దిమడుగు భిక్షపతి అన్నారు. శుక్రవారం చింతకుంట్ల గ్రామం మీదుగా వెళుతుండగా చింతకుంట్ల గ్రామంలో ఉన్నటువంటి గ్రంథాలయాన్ని వారు సందర్శించి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయం ఉండడం వలన విద్యార్థుల విజ్ఞానానికి ఎంతో ఉపయోగపడుతుందని ప్రతి విద్యార్థి కూడా గ్రంథాలయంలో ఉన్నటువంటి పుస్తకాలు అన్నిటిని సమయం కేటాయించి చదువుకోవాలని అన్నారు. వీరి వెంట ఉపసర్పంచ్ ఏ కుల సురేష్, నిర్వాహకులు ఆంజనేయులు, హరికృష్ణ ,నాగేష్ ,సహదేవ్ ,అంజి ,నాగార్జున్, రవి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

పేదోడి ఇంటి నిర్మాణపనులు ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

మండలపరిధిలోని చింతకుంట్ల గ్రామంలో గ్రామానికి చెందిన వంపు వెంకటయ్య కవిత దంపతులకు ఇండ్లు కొన్నేండ్లుగా పూరిగుడిసెలోనే నివాసం ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడుతూ తమకు ఇండ్లు లేదని తమను ఆదుకోవాలని గతంలో కొండమల్లేపల్లి ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే శుక్రవారం ఆమె పేదోడి ఇంటి నిర్మాణం కోసం సొంత ఖర్చులతో ఇంటి నిర్మాణపనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరిని తమ వంతు సహాయంగా పేద ప్రజలను ఆదుకోవడమే తమ లక్ష్యం అన్నారు.వీరి వెంట వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ ఏ కుల సురేష్, మంగ్యా నాయక్,మల్లయ్య, సేవానాయక్, అంజి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మత సామరస్యానికి ప్రతీక గుడిబండ ఉర్సు

నవతెలంగాణ-కోదాడరూరల్

మండలపరిధిలోని గుడిబండ కాగజ్‌నగర్‌లో జరిగే ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి.పేదల పాలిట పెన్నిధిగా పేరుగాంచిన హజ్రత్‌ఖాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాలు జ్ఞాపకార్థం 79 ఏండ్లుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.గరీబ్ నవాజ్ అనగా పేదల కోర్కెలను తీర్చే వాడు అని అర్థం పేదల పెన్నిధిగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్(ర)అజ్మీరీని వేడుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది అందుకే ఇక్కడికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు ఉత్తర భారతదేశంలో ఉన్న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో గల దర్గాకు వెళ్ళలేని వారు అతని కృపకు పాత్రులయ్యేందుకు దక్షిణ భారత అజ్మీర్‌గా పేరుగాంచిన గుడిబండ ఖాజానగర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు వస్తుంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇక్కడ ప్రార్థనలు జరిపితే సంతాన ప్రాప్తి కలుగుతుందని, సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని మంచి జరుగుతుందని విశ్వాసం ప్రజల్లో బలంగా ఉంది.స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో ఇస్లాం వ్యాప్తికి విశేష కృషి చేసి రాజస్థాన్లోని అజ్మీర్ లో జ్యోతిర్మయమైన హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్(ర) వారి దివ్య ప్రబోధాలు ఆధ్యాత్మిక చింతనలు ఇస్లాం ధర్మాలు ప్రబోధించుటకు హజ్రత్ దిలావర్ అలీ వస్సీ షా తన గురువైన హజ్రత్ సర్వరాజ్ అలీ ఆశీర్వాదంతో



గుడిబండలోని గట్టుపై ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.హజరత్ దిలావర్ అలీ వస్సీషా ఆధ్యాత్మిక పండితులు తెలుగు ఉర్దూభాషల్లో అపారపాండిత్యం కలిగి ఉభయభాషల్లో కవిత్వంతో తన ప్రబోధాలను రాష్ట్ర వ్యాప్తంగా అందించేవారు.రాష్ట్ర నలుమూలలా తన అసంఖ్యాకమైన శిష్యగణానికి ఆత్మప్రబోధం చేసి హృదయ మాలిన్యాన్ని ప్రక్షాళన చేసి వారి ఆత్మలను ప్రకాశింప జేసి ఇహ పరలోకాలకు ముక్తిదాయకమైన మార్గాన్ని చూపాలని చెప్పుంటారు.మానవాతీతమైన జ్యోతిని దర్శించి జ్యోతిర్మయి అయ్యారని యోగ పండితులైన దిలావర్ అలీ వస్సీషా జంతువులతో కూడా సంభాషించే వారని ప్రతీతి ఖాజా గరీబ్ నవాజ్ చూపిన మార్గంలో ఆత్మ ప్రబోధం చేసి ఎందరినో ముక్తిమార్గం వైపు మరలించారని చెబుతుంటారు.అందుకే ఈ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొని హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ (ర) అజ్మీరీ ,హజరత్ సర్వరాజ్ అలీ, హజ్రత్ దిలావర్ అలీ వస్సీ షా, హజరత్ ఇస్తేకార్‌అలీ, షాహేవతన్‌లను స్మరించుకొని నివాళ లర్పిస్తారని మతపెద్దలు పేర్కొంటున్నారు.దర్గా వద్ద రాళ్ల మధ్య ఉన్న కొలను మండువేసవిలో సైతం ఎండిపోకుండా నిత్యం నీటితో కళకళలాడుతూ ఉంటుంది.నీళ్లు దొరకడమే గగనం అయ్యే పరిస్థితుల్లో రాళ్ల మధ్య ఉన్న కొలను నీటితో నిండి ఉండడం ఇక్కడి ప్రత్యేకత ఈ కొలనులో స్నానాలు ఆచరిస్తే పాప ప్రక్షాళన జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తారు.ఉరుసు పెద్దలు తమ భక్తి ప్రపత్తులను చాటుకోవడానికి దోహదపడటం గాక గంధం, ఉరుసు ఉత్సవాల్లో భాగంగా రాత్రి నిర్వహించే ఖవ్వాలితో భక్తులు భక్తి భావంతో తన్మయత్వానికి లోనవుతారు. ప్రదర్శనకు వరంగల్ ,హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలు హాజరై భక్తులను ఉర్రూతలూగిస్తారు.అంతేగాక గంధం ఊరేగింపు ప్రారంభ సమయంలో చేసే విన్యాసాలు ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంటాయి.హజ్రత్ దిలావర్ అలీ వస్సీషా వారి మనుమలు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆసిఫ్‌అలీ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు.భక్తులకు అన్నదానం చేస్తారు.అన్నదాన కార్యక్రమంలో పలువురు నాయకులు పాలు పంచుకుంటారు.

అదుపుతప్పి కారు బోల్తా-ఒకరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-నూతనకల్

కారు అదుపుతప్పి బోల్తా పడి ఒక్కరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండలపరిధిలోని ఎడవెల్లి-నూతనకల్ రోడ్డుపై జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాళసింగారం నుండి నూతనకల్‌కు వస్తున్న కారు అతివేగంగా రావడంతో అదుపుతప్పి ఎడవెల్లి నుండి లింగంపల్లి కి కాలినడకన పెళ్లికి వెళుతున్న బయ్య లింగయ్య కు కారు తగలడంతో తీవ్ర గాయాలు కావడంతో అతని ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేటలోని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి.

ఇండ్లు లేని పేదలకు స్థలాలివ్వాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

ఇండ్లు లేని పేదలందరికి 120 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 లక్షలివ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోసబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం అమరవరం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వనమోదు, సర్వే చేస్తే అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. దేశంలో రోజు రోజుకు పేదల సంఖ్య పెద్ద ఎత్తున ఆహార లోపం, మహిళల్లో రక్తహీనత కొనసాగుతుందని ఆవేదన వెలిబుచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారం అధికారంలోకి వచ్చాక కుబేర్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంటున్నారు.దేశ సంపద మొత్తం కూడా ఒక్క శాతంగా ఉన్న పెట్టుబడిదారుల దగ్గరికి పోగౌతుందని ఎనిమిదేండ్ల మోడీ పాలనలో అంబానీ,ఆదాని ఆస్తులు పెద్దఎత్తున పెరిగాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం శాఖ కార్యదర్శి షేక్‌సైదా మీరా, వెంకయ్య, ముత్తిలింగం, పిచ్చయ్య, వీరస్వామి, నాగేశ్వరరావు, బాల సైదులు, దార సైదులు , వెంకన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-మునగాల

అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు.శుక్రవారం నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానంలో హామీ ఇచ్చిన విధంగా పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఆ భూములకు పట్టా హక్కులు



కల్పించలేదని, వెంటనే కల్పించాలని కోరారు.సొంత స్థలం కలిగిన లబ్దిదారులకు ఇంటి నిర్మాణా నికి 6 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు జానయ్య, సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆరే రామకృష్ణారెడ్డి.సంఘం నడిగూడెం మండల కార్యదర్శి సయ్యద్‌హుస్సేన్, సీఐటీయూ నాయకులు మల్లెల వెంకన్న పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం 'కంటివెలుగు'

నవతెలంగాణ-కోదాడరూరల్

దేశానికే ఆదర్శం తెలంగాణ ప్రభుత్వ కంటివెలుగు కార్యక్రమమని మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ అన్నారు.శుక్రవారం పట్టణపరిధిలోని లక్ష్మీపురంకాలనీ 2వ వార్డులోని ఆకృతి స్కూల్‌లో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.కంటి చూపు సమస్యతో బాధపడే వారి బాధలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో కంటి వెలుగు అనే ఈ గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు.ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ధరావత్ కైల స్వామినాయక్, వైద్యాధికారులు వేణుగోపాల్, అశోక్, నాయకులు బషీరుద్దీన్, సాధిక్, గురునాథం, బ్రహ్మం, శ్రీను పాల్గొన్నారు.

సయ్యద్ ఖాజా మోయినుద్దీన్ దర్గా ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-అర్వపల్లి

సయ్యద్ ఖాజా మొయినొద్దిన్ దర్గా(చిన్న దర్గా) ఉర్సు ఉత్సవాల సందర్భంగా గంధం ఊరేగింపులో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ హాజరయ్యారు.శుక్రవారం మండలకేంద్రంలోని పెద్దగుట్ట వద్దగల చిన్నదర్గా వద్ద గల సయ్యద్ ఖాజా మొయినుద్దీన్ ఉర్సు ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జెడ్పీటీసీ పెద్ద దర్గా నుండి చిన్నదర్గా వరకు గంధం తీసుకువచ్చారు.అనంతరం దర్గాలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు వెన్న శ్రీకాంత్ రెడ్డి,సాయి నిఖిల్, మధుకర్‌రెడ్డి, ముజావర్ ఎడీ హబీబ్, జానీ, ఫజల్, ముజీబ్, రబ్బానీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్న గవర్నర్

నవతెలంగాణ-పాలకవీడు

గవర్నర్ తమిళ సై తన స్థాయిని మరిచి బీజేపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిలు మండిపడ్డారు.మండలంలోని జాన్‌పహాడ్ దర్గా దర్శనానికి వచ్చిన వీరు పాత్రికేయులతో మాట్లాడారు.గవర్నర్ రాజ్‌భవన్‌ను భారతీయ జనతా పార్టీ కార్యాలయంగా మార్చేలా తయారయ్యారని విమర్శించారు. సీఎం కేసీఆర్ గవర్నర్‌కు ఎంతో గౌరవం, ప్రాధాన్యత ఇస్తున్నా ఆమె కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తుండడం దారుణమన్నారు.తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న అద్భుతపథకాలను చూసి ఇప్పటికైనా గవర్నర్ తమిళ సై హుందాగా ప్రవర్తించి రాజ్యాంగం అందించిన పరిధిలో, విధులు నిర్వహించాలని కోరారు.

వ్యకాస తుంగతుర్తి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-నాగారం

ఈనెల 29న నాగారం మండలం డి .కొత్తపల్లి గ్రామంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం తుంగతుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పులుసు సత్యం పిలుపునిచ్చారు.శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామీణ ప్రాంతంలో 60 శాతం పైగా ఉన్న వ్యవసాయ కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.పేదలకు ఉచితంగా విద్య, వైద్యం,ఉపాధి కల్పించాలని కోరారు.కనీస వేతనచట్టాన్ని సవరించి కొత్త జీవో విడుదల చేసి పెరిగిన కూలి రేట్లు గ్రామాలలో అమలు జరిగేలా ప్రభుత్వమే ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టినందున వెంటనే అన్ని గ్రామాలలో యుద్ధప్రతిపాదికన ఉపాధిహామీ పనులు కల్పించి వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని అన్నారు.సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మట్టిపల్లి సైదులు హాజరవుతున్నారని తెలిపారు.ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడియంకుమార్,జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు కడెంలింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పడమటిరెడ్డి నగేష్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం తిరుమలగిరి మండల కార్యదర్శి వనం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీకి గుంతలు తీశారు..మరిచిపోయారు...

- ఇండ్లలోకి ఎలా వెళ్ళేది...?
- దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


నవతెలంగాణ-కోదాడరూరల్

డ్రయినేజీ కోసం గుంతలు తీశారు.. సంవత్సరం అవుతున్న మున్సిపాలిటీ అధికారులు డ్రయినేజీని కట్టకుండా అలా వదిలేశారు దీంతో కాలనీవాసులు అవస్థలు వర్ణనాతీతం.ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డు గణేష్‌నగర్‌లో చోటుచేసుకుంది.15 రోజుల కింద కాలనీకి చెందిన చెన్నారెడ్డి ఇంటిముందు డ్రయినేజీ కోసం నడుములోతు గుంతలు తవ్వారు. డ్రయినేజీ కట్టడం మరచిపోయారు. దీంతో ట్రాక్టర్‌ను తీయలేక ఇబ్బందులు పడుతున్నారు.అంతేకాకుండా వారికున్న పొలానికి ఉపయోగించుకోవాల్సిన ట్రాక్టర్‌ను కిరాయికి తీసుకువచ్చి నడుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. అంతేకాకుండా పశువులను మేతకు పంపించలేక వాటిని 15 రోజులుగా అక్కడనే ఉంచి నేపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రయినేజీ తీసే సమయంలో వారి ప్రహరీ కూడా కూలిందని తెలిపారు.అదేవిధంగా వారి ఇంటి వద్ద డ్రయినేజీ గుంతలు తీసి ఏడాదవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.ఆ గుంతలలో మురుగునీరు చేరి దోమలకు, పందులకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది.అంతేకాకుండా ఇండ్లలోకి పోవాలంటే తడికలను ఇనపగేట్లను వేసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.అలా వెళ్లే క్రమంలో పిల్లలకు,వృద్ధులకు అనేక గాయాలైన సంఘటనలు కోకొల్లలు.అధికారులు ఇలా ఎలా చేశారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డ్రయినేజీల కోసం తీసిన మట్టిని కూడా ఎత్తి రోడ్డు మీదే పోయడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.అధికారులు ఇప్పటికైనా స్పందించి నిర్మిస్తే డ్రయినేజీ నిర్మించండి లేకపోతే...గుంతలను పూడ్చివేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళిన పొంతన లేని సమాధానాలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



పశువులకు మనుషులకు దారేది:చెన్నారెడ్డి

డ్రయినేజీ కోసం మా ఇంటి ముందు తీసిన గుంత వలన ఇంట్లోకి పశువులు, మనుషులు వెళ్లలేక బయటకు రాలేక నానాఇబ్బందులు పడుతున్నాం. అధికారులు ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటున్నారు తప్ప సమస్య మాత్రం పరిష్కరించడం లేదు.అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుకుంటున్నాం.



ఎలక్ట్రిషియన్ యూనియన్ మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపల్‌కేంద్రంలో శుక్రవారం ఎలక్ట్రిషియన్ అసోసియేషన్ మండల సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా వై. సోమయ్య ఉపాధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డితో పాటు ఊడుగు సుధాకర్, షరీఫ్ ఎన్నికయ్యారు.

నవతెలంగాణ

ఉత్తమ అధికారులను సన్మానించిన సత్తిరెడ్డి

నవతెలంగాణ- భువనగిరిరూరల్

74వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ అధికారులుగా ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులను శుక్రవారం మాజీ చైర్మెన్ ఎడ్ల సత్తిరెడ్డి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో ఆర్డీవో కార్యాలయ అధికారి మందడి ఉపేందర్ రెడ్డి, డివిజనల్ ఆఫీస్ సిబ్బంది జగన్, నవీన్, రాచకొండ కమిషనరేట్ ఏసీపీ వెంకట్ రెడ్డిని ఉన్నారు. ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు.

విజయ డెయిరీ చైర్మెన్‌గా రాములు

నవతెలంగాణ- భువనగిరిరూరల్

మండలంలోని గౌస్ నగర్ గ్రామంలో విజయ డెయిరీ చైర్మెన్‌గా పాక రాములును గురువారం రాత్రి ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా నల్లమాసు ప్రసాద్, గడసందుల రవీందర్, కొమ్ము వెంకటేష్, పాక శంకర్, పాక లక్ష్మీనారాయణ లతో పాటు సభ్యులు గా బండ బిక్షపతి కొమ్ము నగేష్, నల్లమాసు బాలయ్య, బేతాళ నరసింహ, వడ్డెబోయిన బిక్షపతి, బోడపట్ల మల్లారెడ్డి లను ఎన్నుకున్నారు.

బాలిక అవకాశాలు-హక్కులు సాధికారత పై అవగాహన

నవతెలంగాణ-అడ్డగుడూర్

మండలంలోని కేజీబీవీలో వాయిస్ ఫర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 8,9 తరగతి చదువుతున్న విద్యార్థినులకు బాలిక అవకాశాలు - హక్కులు,సాధికారత అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీపీ దర్శనాల అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల పాటు బాలికల అవకాశాలు హక్కులు సాధికారత కార్యక్రమం గురించి బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ ఆఫీసర్ కృష్ణ, ఎంపీడీఓ చంద్రమౌళి,విష్ణు వర్ధన్ రెడ్డి,.మహేష్, స్పెషల్ ఆఫీసర్ సరిత ,ఉపాధ్యాయ బృందం, బాలికలు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ పైపులైన్ పనుల పరిశీలన

నవతెలంగాణ - భువనగిరి

పట్టణంలోని 8 వ వార్డు రామ్ నగర్ ప్రాంతంలో నీటి ఎద్దడి నివారణకు జరుగుతున్న మిషన్ భగీరథ ద్వార పైప్ లైన్ లింక్ పనులను శుక్రవారం మున్సిపల్ చైరెన్ ఎన్నబోయిన ఆంజనేయులు , కమిషనర్ నాగిరెడ్డి , కౌన్సిలర్ పంగారేక్కా స్వామి పర్యవేక్షించారు. అదేవిధంగా పారిశుధ్య పనులను చైర్మెన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబితా గోపాల్ సుదర్శన్ రమేష్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ - భువనగిరి

మున్సిపల్ పరిధిలోని రాయగిరి వెంకటేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మెన్ చింతల కిష్టయ్య గురువారం దేవాలయ ఆవణలో ఆవిష్కరించారు. ఫిబ్రవరి 4వతేది నుండి 8 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించిన పీడీ

నవతెలంగాణ -చిట్యాలటౌన్

చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా పీడీ శ్రీపాద రామేశ్వర్ చిట్యాల పి హెచ్ సి డాక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి శుక్రవారం సందర్శించారు. కంటి పరీక్షల తీరును పరిశీలించినారు. అనంతరం టిఎంసి సరిత , ఆర్పీలతో రివ్యూ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో స్ట్రీట్ వెండర్ లోన్లను బ్యాంకుల వారిగా లక్ష్యాలను చేరుకోవాలని నిర్దేశించినారు. ఈ సమావేశంలో టీఎంసీ సరిత, ఆర్పీలు పాపయ్య, జె సైదులు, ఆర్ నర్సిరెడ్డి, సరిత సుజాత, జ్యోతి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-దేవరకొండ

స్థానిక బీసీ బాలికలు వసతిగృహంలో విద్యార్థినిలకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, హాస్టల్ వార్డెన్ రేణుక, మాట్లాడుతూ విద్యార్థినులు పరీక్షల్లో ఒత్తిడి గురి కాకుండా మంచి ఫలితాలు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బొడ్డుపల్లి అర్జున్, పవన్,శివ, కిరణ్, అంజి, మధు, పూజ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి

నవతెలంగాణ-నాంపల్లి

మండలకేంద్రంలోని కంటివెలుగు కేంద్రాన్ని నల్లగొండ జిల్లా వైద్యాధికారి అన్నిమల్ల కొండల్‌రావు శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును, రిజిస్టర్లను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు సయ్యద్‌ఇక్బాల్, కంటివెలుగు డాక్టర్లు ఉదయ్ కిరణ్, శ్రీనివాస్, వెంకటేష్, ఏఎన్ఎంలు గాదెపాక పుష్ప, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు ఏదుళ్ళ సునీత, ఏదుళ్ళ కవిత, కోరె లలిత, నీలిమ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరగాలి

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి

నవ తెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరపాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ ను ఆదర్శించారు. శుక్రవారం రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ,విద్యా శాఖ డైరెక్టర్ శ్రీ దేవసేన,రాష్ట్ర విద్యా మౌలిక వసతుల సంస్థ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి తో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు , పదోన్నతులు ఇచ్చిన సమయం లో పూర్తి చేసి సీనియారిటీ, వేకెన్సిస్ ల



జాబితా నోటీస్ బోర్డులో డిస్ప్లే చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన మోడల్ పాఠశాలల్లో సంపూర్ణంగా పనులు పూర్తి చేసి జనవరి 30 నాటికి 32 పాఠశాలలు ప్రారంభం కు సిద్దంగా ఉన్నట్లు, మండలం కు రెండు చొప్పున ఎంపిక చేసినా మిగతా పాఠశాలల్లో కూడా అన్ని పనులు ఫిబ్రవరి 10 వ తేది నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయుల పదోన్నతులు,బదిలీలు సంబంధించి ఖాళీల జాబితా, సీనియర్టీ జాబితా వెబ్ సైట్ లో పొందు పరిచినట్లు తెలిపారు. ఈ వీడియో వి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఖుషఘ్బ గుప్తా,డిఈఓ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో బ్యాంకింగ్ సేవలు

- **డీఎస్ఓ వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

జిల్లాలోని అన్ని రేషన్ షాపులలో బ్యాంకింగ్ సేవలను ప్రారంభించనున్నట్లు డిఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని ఉదయాదిత్య భవన్లో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. జిల్లాలోని 991 రేషన్ షాపుల్లో కార్డుదారులకే కాకుండా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా వన్ నేషన్, వన్ రేషన్ నల్లగొండ జిల్లాలో ప్రారంభం కానుంది అని తెలిపారు. దీంతో ఇతర రాష్ట్రాల్లోని వలస కూలీలు, ఇతరులు జిల్లాలో సైతం రేషన్ సరుకులు



పొందవచ్చు అని పేర్కొన్నారు.అనంతరం (ఐపిపిబి) ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఫణి లక్ష్మి కాంత్ బ్యాంకింగ్ సేవలపై రేషన్ డీలర్లకు అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో ఐపిపిబి అధికారులు డి రవీందర్ నాయక్, సూర్యాపేట డిప్యూటీ తాసిల్దార్లు, ఆ రైలు రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్ లాగ్ పరీక్షల నిర్వహణ

నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

విద్యా సంవత్సరం 2007 నుండి 2010 బ్యాచ్ ల ఎన్జీ కళాశాల విద్యార్థులకు అదేవిధంగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని 2011 నుండి 2016 బ్యాచుల విద్యార్థులకు వన్ టైం బ్యాక్ లాగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గణ శ్యామ్, పరీక్షల నియంత్రణ అధికారి బి. నాగరాజు లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాక్లాగ్ పరీక్షల కోసం అభ్యర్థులు ఎన్జీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించి వివరాలను ఎన్జీ కళాశాల నోటీస్ బోర్డు, అధికారిక వెబ్సైట్ లో పొందుపరిచినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9989897566 ను సంప్రదించాలని తెలిపారు.

శ్రీనివాస్ సంతాప సభ

నవతెలంగాణ -చిట్యాల

చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006- 2007 బ్యాచ్ పదవతరగతి చదువుకున్నపూర్వ విద్యార్థి మూడుదుడ్ల శ్రీనివాస్ ఇటీవల అకాల మృతి చెందడంతో పాఠశాల ఆవరణలో సంతాప సభ నిర్వహించారు.ఈ సంతాప సభలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంతాప సభకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గోలి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ ఎలికట్టే లో 1997 నుండి 2009 వరకు పనిచేసిన పూర్వ ప్రధానోపాధ్యాయులు కుకుడాల గోవర్ధన్ హాజరై మాట్లాడుతూ శ్రీనివాస్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తూ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మరణించడం వారి కుటుంబానికి తీరని లోటని , వారికి ఇద్దరు కుమార్తెలు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే మృతి చెందటం బాధాకరమని వారి కుటుంబానికి సహ విద్యార్థులు స్నేహితులు గ్రామ పెద్దలు ఆర్థిక సహాయాన్ని అందజేయలని కోరారు ఈ సంతాప సభలో పూర్వవిద్యార్థులు మూడు దుడ్లఅశోక్ కుమార్, రామకృష్ణ, వేణు ,మాదగోని శ్రీనివాస్, సహవిద్యార్థులు గొలనుకొండ విజయ్ కుమార్,కొండ కిందివేణుగోపాల్ రెడ్డి, గొలనుకొండ భాస్కర్,మూడు ధూడ్ల శ్రీధర్ ,కొండకింది వేణుగోపాల్ రెడ్డి, గ్రామ పెద్దలు నాగార్జున యాదగిరి, సోమనబోయిన సంజీవ, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.వెంకట్ రెడ్డి, వెంకట నరసింహ చారి, రాంభూపాల్, వెంకన్న ,రవి ,సిలువేరు నరసింహ పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను అగౌరపరుస్తున్న అధికారులు

- **జెండా పండుగలకు ఎంపీటీసీ , సర్పంచులకు అందని ఆహ్వానం**
- **కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్న ఎంపీటీసీ , సర్పంచులు**

నవతెలంగాణ -మునుగోడు

దేశ , రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు , ప్రజాప్రతినిధులు కనుల సంబరంగా ఘనంగా నిర్వహించుకునే జెండా పండుగలు స్వతంత్ర , గణతంత్ర , రాష్ట్ర ఆవిర్భావ , రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకుండా మండలంలోని వివిధ శాఖల మండల అధికారులు అగౌరపరుస్తున్నారని కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 72వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ , సర్పంచులకు మండల పరిషత్ , రెవిన్యూ , వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ గ్రామాలలో సమావేశాలు జరిగేటప్పుడే సమాచారం ఇస్తున్నారు తప్ప ఎంతోమంది అమరవీరుల త్యాగాల ఫలితంగా ప్రతి ఏడాది జరుపుకున్నే జెండా పండుగలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాల్సిన అధికారులు ఆహ్వానం అందించకుండా అవమానపరుస్తున్నారని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించని అధికారులను ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ సమావేశంలో నిలదీయడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సీఆర్‌పీల దశాబ్ది మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ -అడ్డగూడూర్

ఈనెల 29న హైదరాబాద్‌లో తెలంగాణ భవన్ లో నిర్వహించే సీఆర్‌పీల సంఘం దశాబ్ది మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాములుయాదవ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోనిర్వహించిన సీఆర్‌ఎపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ,విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సీఆర్పీల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోల సత్యం, దేవ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మండలంలోని శ్రీనివాస్ నగర్ గ్రామ పరిధిలో శుక్రవారం కోదాడ-జడ్చర్ల రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా బాలికకు తీవ్రగాయాలయ్యాయి.మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....వేములపల్లి మండలం అమనగల్ గ్రామానికి చెందిన పాములపాటి యల్లమ్మ(50) తన చెల్లెలి కొడుకు పట్టేటి సిద్దు(22) మనువరాలు లక్ష్మి (14) తో కలిసి శ్రీనివాస్‌నగర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పెండ్లికి హాజరైంది.పెండ్లి అనంతరం బైక్ పై ముగ్గురు కలిసి ఫంక్షన్‌హాల్ నుంచి రోడ్డు మీదకు రాగా వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యల్లమ్మ, సిద్దులు అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ఘటనాస్థలాన్ని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు సందర్శించి ఘటనను పరిశీలించారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిర్యాలగూడ నియోజక వర్గ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-వేములపల్లి

మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు.శుక్రవారం మండలంలోని బుగ్గబావిగూడెం, వేములపల్లి, శెట్టిపాలెం, మొల్కపట్నం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.పలు రాష్ట్రాల సీఎంలు రాష్ట్రంలోని సంక్షేమపథకాలను అనుసరిస్తున్నారన్నారు.నియోజకవర్గం పలు సంక్షేమపథకాలతో ప్రజలకు చేరువైందన్నారు.నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో రహదారులు, డ్రయినేజీలు,సీసీరోడ్లు, మంచినీటి సౌకర్యంకోసం నిధులు మంజూరు చేశామన్నారు.అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసే సీఎం కేసీఆర్‌ను ప్రజలంతా ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత కురుపయ్య, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ వెంకటయ్య, వైస్‌ఎంపీపీ పాదూరిగోవర్ధన శశిధర్‌రెడ్డి, ఎంపీడీఓ దేవిక, సర్పంచులు చిర్రమల్లయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మజ్జిగపు పద్మ సుధాకర్‌రెడ్డి, నాగలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు చల్లబట్ల చైతన్య ప్రణీత్‌రెడ్డి, పల్లా వీరయ్య, టీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాలలో పరీక్ష పే చర్చ కార్యక్రమం

నవతెలంగాణ- చిట్యాలటౌన్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పరీక్షల గురించి విద్యార్థులకు తగు సూచనలు చేశారు .చిట్యాల పట్టణ కేంద్రంలో శుక్రవారం విజిఎస్ గార్డెన్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్ పాల్గొని విద్యార్థులకు చదువుపై ఉండే స్ట్రెస్, పరీక్ష వాసే విధానంపై, ఉన్నత స్థానాల్లో ఎదిగే విషయంపై వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోడీ పరీక్ష పే చర్చ కార్యక్రమము టీవీలో వీక్షించారు. స్వచ్ఛభారత్ పై 200 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం నోట్ బుక్,పెన్నులు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శేపూర్ రవీందర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహా, మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ గారు , దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాస శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

నవతెలంగాణ-పెద్దవూర

ఈనెల 30,31 ఫిబ్రవరి ఒకటవ తేదీలలో దామరచర్లలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అకారపు నరేష్ పిలుపునిచ్చారు.శుక్రవారం మండలకేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు.జిల్లాలో విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు నడుపుతున్న విద్యార్థి ప్రతినిధులకు పోరాటాల పురిటిగడ్డ (మిర్యాలగూడ) ప్రాంతమైన దామరచర్లలో మూడురోజులపాటు నిర్వహించే క్లాసులకు జిల్లావ్యాప్తంగా 200 మంది హాజరవుతున్నారన్నారు.తరగతులలో దేశ,రాష్ట్ర రాజకీయాలపై, శాస్త్రీయఆలోచనపై, విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు సవాళ్లపై చర్చించి భవిష్యత్‌లో చేపట్టబోయే పోరాటాల కార్యాచరణను రూపొందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోరే రమేశ్, శ్రీకాంత్, వంశీ, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.





భవిష్యత్తు నిధితో కుటుంబానికి భరోసా

● సహాయ కమిషనర్ ఎం.దుర్గాప్రసాద్

నవతెలంగాణ -నార్కట్‌పల్లి

కార్మికుల భవిష్యత్తు నిధితో కుటుంబానికి భరోసా అని కార్మిక,ఉపాధి ,మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వ సహాయ కమిషనర్ ఎం.దుర్గా ప్రసాద్. పేర్కొన్నారు. కార్మిక, ఉపాధి, మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ 2023 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక కామినేని వైద్య విద్య కళాశాల ఆడిటోరియంలో కార్మికుల భవిష్యత్తు నిధి పై గ్రీవెన్స్ డే ,భవిష్యత్తు నిధి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పనిచేస్తున్న క్రమంలో తమ వేతనం నుంచి కొంత భాగాన్ని భవిష్యత్తు నిధి కోసం దాచుకోవడం ద్వారా కుటుంబ అవసరాలకు పిల్లల చదువుల కోసం ఉపయోగపడుతుందని సూచించారు. ప్రయివేట్ సెక్టార్లు పనిచేసే ప్రతి ఒక్కరు ఈపీఎఫ్ జమ చేసుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సురక్ష సెక్యూరిటీ యాజమాన్యం పిఎఫ్ నిధి వేతనం నుంచి ప్రతినెలా తీసుకొని పీఎఫ్ కార్యాలయంలో జమ చేయడం లేదని ఆ సిబ్బంది సహాయ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మామిడి దేవేంద్ర కామినేని వైద్య విద్య కళాశాల సిబ్బంది సింగం రాజు, పూజేల్ బాబా తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌కు విలువైన వస్తువులు వితరణ

నవ తెలంగాణ -చండూర్

మండలంలోని పుల్లెంల గ్రామంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కన్నఊరిలో ఉన్న బడి పిల్లలకోసం కంప్యూటర్ సిస్టమ్ - ప్రింటర్ కమ్ జిరాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కోసం 43 ఇంచుల ఎల్ఈడి టీవీ 1.50లక్షల వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం అదే గ్రామానికి చెందిన బొబ్బల వెంకట్రామిరెడ్డి అలియాస్ రామ్ రెడ్డి కన్నా ఊరుపైన ఉన్న ప్రేమను ఈ విధంగా తీర్చుకోనుటకుగాను వారి తాత,బాబాయ్ లైన బొబ్బల రాం రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి లా జ్ఞాపకార్థంగా శుక్రవారం వారి తల్లిదండ్రులైనా గ్రామ సర్పంచ్ బొబ్బల సంధ్యారాణి-మురళిమనోహర్ రెడ్డి చేతుల మీదగా పాఠశాల సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు,చంద్రయ్య ,గ్రామా యువకులు పిన్నింటి నరేందర్ రెడ్డి , పేసర్ల హరీష్ ,ముక్కాముల సైదులు , నకేరెకంటి రఘు ,మహేష్ ,పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ -నకిరేకల్

నకిరేకల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా మిరియాల కనకయ్య, ఉపాధ్యక్షులుగా చిలుకూరి విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా కోట సతీష్ కుమార్, కోశాధికారిగా మిర్యాల రమేష్, సహాయ కార్యదర్శులుగా ఎస్.కె పాషా, గుర్రం నరసింహ, డైరెక్టర్లుగా పున్న శంబయ్య, చిలుకూరి శ్రవణ్ కుమార్, దేవులపల్లి విజయ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి పరమాత్మ ప్రమాణ స్వీకారం చేయించారు ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సహాయ కార్యదర్శి చిలుకూరి లక్ష్మీనరసయ్య, జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ యానాల రజనీకాంత్ రెడ్డి, ప్రతినిధులు కోటగిరి శ్రీనివాస్, దుస్సా సత్యనారాయణ, చిలుకూరి జనార్దన్, చిలుకూరి సుధాకర్, చిలుకూరి వెంకటేశ్వర్లు, సామల రామాంజనేయులు పాల్గొన్నారు.

సీసీడ్రైన్ నిర్మాణపనులను ప్రారంభించిన కౌన్సిలర్

నవతెలంగాణ-హాలియా

పట్టణంలోని 11వ వార్డులో మున్సిపాలిటీ అభివృద్ధి హామీ మేరకు ఇచ్చిన విధులలో సుమారు నాలుగు లక్షల 40000 తో ధర్మనాయక్ ఇంటి నుండి బాలు నాయక్ ఇంటి వరకు 220 మీటర్ల మేరా నిర్మిస్తున్న సిసి డ్రైన్ నిర్మాణ పనులను శుక్రవారం అవార్డు కౌన్సిలర్ వర్రె వెంకటరెడ్డి ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఉప ఎన్నిక హామీలలో భాగంగా ఇచ్చిన నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో 'కంటివెలుగు' ప్రతిష్టాత్మకమైనది



నవతెలంగాణ -పెద్దవూర

రాష్ట్రంలో 'కంటి వెలుగు' ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని మండల వైద్యాధికారి నగేష్ అన్నారు.మండలంలోని తెప్పలమడుగు గ్రామంల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు.మండలవ్యాప్తంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు సహకరించాలన్నారు.ఆరోగ్యతెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం 2వ విడత కంటివెలుగు కార్యక్రమం సాగుతుందని తెలిపారు.కంటివెలుగు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నదని, ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అనురాధాసుందర్‌రెడ్డి, తిరుమలగిరిసాగర్ అంగోత్ భగవాన్, రాష్ట్ర నాయకులు రంజిత్‌యాదవ్,రాష్ట్ర నాయకులు గురువయ్య,సర్పంచులు నడ్డిలింగయ్యలక్ష్మమ్మ, ఉపసర్పంచ్ ఎల్లమ్మ, వెంకటయ్య, జానపాటి లక్ష్మణ్,యూత్ నాయకుడు కుంటిగొర్ల రాజశేఖర్,నాగరాజు,భిక్షమయ్య కృష్ణయ్య, నాగయ్య పాల్గొన్నారు.



వివాహా వేడుకలో జెడ్పీటీసీ

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని నెవిళ్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సయ్యద్ ఇస్మాయిల్ - కరింబీ దంపతుల కుమార్తె వివాహ కార్యక్రమంలో నాంపల్లి జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మెన్ నక్క చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కోరె యాదయ్య, నాంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాలెంక గురుపాదం, ఉపాధ్యక్షుడు కోరె మురళి, నాంపల్లి మాజీ ఉప సర్పంచ్ సంగం గణేష్ పాల్గొన్నారు.

పలువురు కుటుంబాలకు వీరేశం పరామర్శ

నవతెలంగాణ -నకిరేకల్

మండలంలోని చందుపట్ల గ్రామంలో పలువురు కుటుంబాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మంగినపల్లి ముత్తయ్య, చింతమల్ల భాస్కర్లు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఆలకుంట్ల వెంకన్న, అనారోగ్యంతో మృతి చెందిన శివరాత్రి లింగమ్మ, గంగుల ముత్యాలు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



జమున మృతి తీరని లోటు

నవతెలంగాణ -చిట్యాలటౌన్

ప్రముఖ సీనియర్ సినీనటి బహుభాషా చిత్ర కథానాయకురాలు జమున శుక్రవారం మరణించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక ఎం ఎస్ రెడ్డి ఫంక్షన్ హాల్లో జమున చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనమా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జమున ఇప్పటివరకు 150 పైగా చిత్రాలకు కథానాయకగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషలో నటించి ప్రేక్షకులను మెప్పించినారన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తెరెట్ పల్లి హనుమంతు, వాసవి క్లబ్ అధ్యక్షులు ప్రొద్దుటూరు శ్రీనివాసులు, ప్రొద్దుటూరు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి ఉమాశంకర్ ,కోశాధికారి ఇమ్మడి వెంకటేశ్వర్లు, కనకదుర్గ దేవాలయం చైర్మన్ శీలా సత్యనారాయణ, మండల యువజన సంఘం అధ్యక్షులు కలకుంట్ల రవికుమార్ వనపర్తి వెంకటేశ్వర్లు, బెల్దే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ- చిట్యాల

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఉప్పల్ కు చెందినలక్మపాగ కిరణ్ కుమార్ భార్య ఆర్తి కిరణ్, ఇద్దరు పిల్లలతో కారులో శుక్రవారం విజయవాడ నుండి హైదరాబాద్ కు వెళ్తున్న క్రమంలో చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోకి రాగానే ఒక వ్యక్తి డివైడర్ దాటుతున్న క్రమంలో ఆ వ్యక్తిని తప్పించబోయి ఎడమవైపుకు కారును మళ్ళించగా అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఆర్తి కిరణ్(37) కు తీవ్రమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం నార్కట్పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా వైద్యులు మరణించిందని నిర్ధారణ చేయడంతో మృతురాలి భర్త కిరణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏ ఎస్ఐ జానారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడల్లో ప్రతిభను కనబరిస్తే గుర్తింపు

నవ తెలంగాణ -మునుగోడు

క్రీడల్లో తమ ప్రతిభను కనబరిస్తే యువతకు ప్రజలలో మంచి గుర్తింపు పెరుగుతుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొంపల్లి గ్రామంలో ఫిబ్రవరి 11న ప్రారంభమయ్యే మునుగోడు నియోజకవర్గం స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూక్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్ , బీజేవైఎం జిల్లా నాయకులు మేకల ప్రమోద్ రెడ్డి , బీజేపీమండల నాయకులు వీరమల్ల సురేష్ , జీడిమడ్ల సత్తయ్య , మొగుదాల శంభు లింగం , సంకు యాదగిరి , మొగుదాల శివయ్య , చుక్క నరేందర్ , శ్రీశైలం , స్వామి , మహేష్ , జూకంటి శ్రీశైలం , తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త మృతి

నవతెలంగాణ-మర్రిగూడ



మర్రిగూడ మండలం నామాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త లక్కు అంజయ్య శుక్రవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ ఊరు పక్క సరిత నగేష్ వారి స్వగ్రామానికి వెళ్లి అంజయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన ఖర్చుల నిమిత్తం రూ.10వేల వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందేటట్లు చూస్తానని భరోసా ఇచ్చారు.ఆయన వెంట టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రిషన్ కార్మికులను ఆదుకోవాలి

నవతెలంగాణ- నకిరేకల్

ప్రభుత్వం ఎలక్ట్రిషన్ కార్మికులను ఆదుకోవాలని ఎలక్ట్రిషన్ కార్మిక సంఘం అధ్యక్షులు నల్ల రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ ఎలక్ట్రిషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా కళ్యాణమండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు అంజయ్య, ప్రతినిధులు శీనాల మల్లయ్య, జానయ్య, గిరి, సురేష్, సాయి వంశీ, అనిల్, గోవర్ధన్, ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు

కస్తూర్బాగాంధీ భవననిర్మాణపనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-త్రిపురారం

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం త్రిపురారంలకు నూతన భవన నిర్మించేందుకు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ వారు ముందుకు రావడం అభినందనీయమని నాగార్జునసాగర్ శాసనసభ్యులు నోముల భగత్‌కుమార్ తెలిపారు.కంపసాగర్ పరిధిలోని మోడల్ స్కూల్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ వారిచే రూ.2 కోట్ల అంచనా వ్యయంతో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.14 సంవత్సరాలుగా వసతుల లేమితో బాలికలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో పక్కా భవనం నిర్మించుటకు ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కేటాయించామని అందులో భవనం నిర్మించుటకు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ వారు ప్రతిపాదన చేయగానే అంగీకరించి ముందుకు వచ్చారన్నారు.నిరుపేద బలహీన వర్గాల బాలికలు చదివే కేజీబీవీలను ఆధునికరించి అన్ని వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అనంతరం ఆదర్శ పాఠశాలలో 10 లక్షల రూపాయల వ్యయంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు.సెకండరీ స్థాయిలోనే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని విద్యార్థులకు అందించే విధంగా భవిష్యత్‌లో ఐటీ కోడింగ్ ద్వారా కొత్త కొత్త సాఫ్ట్‌వేర్ యాప్‌లు రూపొందించే విధంగా విద్యార్థులకు ప్రోత్సహించుటకే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారన్నారు.విద్యార్థులందరూ పాల్గొనే విధంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రతి



విద్యార్థి అందుపుచ్చుకునే విధంగా అందులో ప్రతిభ చూపే విధంగా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ వైస్‌చైర్మెన్ నారాయణరెడ్డి, ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ ధనావత్ భారతి భాస్కర్ నాయక్, నిడమనూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ మర్ల చంద్రారెడ్డి, తహసీల్దార్ కేసి ప్రమీల,బహునూతుల నరేందర్, ధూళిపాళ్ల రామచంద్రయ్య, సర్పంచ్ శ్రవణ్‌కుమార్ అవిడయ్య, వైస్‌ఎంపీపీ అవిరెండ్ల మట్టయ్య, మండల విద్యాధికారి ఎం.బాలాజీ నాయక్, బచ్చు సాంబయ్య, కామెర్ల జానయ్య,తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణం కోసం పాదయాత్ర

నవతెలంగాణ-మాడుగులపల్లి

ఈనెల 30న పాములపాడు నుండి మాడుగులపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చారు.మండలకేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ మాడుగులపల్లి నుండి పాములపాడు వరకు గత 70 ఏండ్ల కింద రోడ్డును నిర్మించారన్నారు.కానీ సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డు వలన మండలకేంద్రం మాడుగులపల్లి ఏర్పడిన కారణంగా మండలకేంద్రానికి నల్గొండ జిల్లాకేంద్రానికి ప్రజల రాకపోకలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంటుందన్నారు.వివిధ ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితిని బట్టి మండలకేంద్రమైన మాడుగులపల్లి నుండి పాములపాడు వరకు డబుల్ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న పాములపాడు నుండి మాడుగులపల్లి మండల కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు.యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.ఈ సమావేశంలో పార్టీ మండల సహాయకార్యదర్శి పుల్లెముల శ్రీకర్,మండల నాయకులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, ఊరుగొండ శ్రీనివాస్, జుకూరు నాగయ్య, తంగెళ్ల నాగమణి, గాడగోజు వెంకటాచారి, సర్పంచ్ ఎర్ర కన్నయ్య, దేవిరెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-చిట్యాల

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని వట్టిమర్తి గ్రామసమీపంలో చోటు చేసుకుంది.ఏఎస్సై జానారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన లక్కపాగ కిరణ్ కుమార్ భార్య ఆర్తి కిరణ్, ఇద్దరు పిల్లలతో కారులో శుక్రవారం విజయవాడ నుండి హైదరాబాద్ కు వెళ్తున్న క్రమంలో చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోకి రాగానే ఒక వ్యక్తి డివైడర్ దాటుతున్న క్రమంలో ఆ వ్యక్తిని తప్పించబోయి ఎడమవైపుకు కారును మళ్ళించగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఆర్తి కిరణ్(37)కు తీవ్ర గాయాలయ్యాయి.దీంతో చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా వైద్యులు మరణించిందని నిర్ధారణ చేయడంతో మృతురాలి భం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-తుంగతుర్తి

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తారని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ దుస్స జనార్ధన్ అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నేడు న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంతో పాటు న్యాయవాదుల సమస్యల ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ సందర్భంగా అసోసియేషన్ క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా నాయకులు బొమ్మగాని శ్రీనివాస్,టి.మురళి న్యాయవాదులు జిల్లా కుమారస్వామి,తాళ్లపల్లి సత్యనారాయణ,కుంభం రణధీర్,హరిచరణ్, గుగులోతు రాజారాం,ప్రతాప్ సతీష్,అనిల్, నాగరాజు, రవి కుమార్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొడమల్లపల్లి వైస్‌ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు కోరారు.శుక్రవారం మండలపరిధిలోని దేవరోనితండా గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.గ్రామంలోని ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కళ్ళజోడును పొందాలన్నారు.ఈఅవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇస్లావత్ రాకేష్‌నాయక్, డాక్టర్ రసూల్, సూపర్వైజర్ రాణి, ఏఎన్ఎంలు శ్రీదేవి, లలిత, ఆశావర్కర్ పద్మ పాల్గొన్నారు.



'కంటివెలుగు' శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండలపరిధిలోని అనాజీపురంలోని జెడీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న కంటివేలుగు శిబిరాన్ని డీఎంహెచ్ఓ కోటాచలం శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కర్ని వారు చేసే పనిని ప్రశ్నల రూపంలో అడిగి తెలుసు కున్నారు. అనంతరం గ్రామంలో కంటి సమస్యలు ఉన్నా ప్రతిఒక్కరికి వైద్య సిబ్బంది విధిగా కంటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెచ్ఈఓ చంద్రశేఖర్, రాజు, వెంకటరమణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా గంధం ఊరేగింపు

- కాసరాబాదులో ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-సూర్యాపేటరూరల్

సూర్యాపేట మండలపరిధిలోని కాసరాబాద గ్రామంలో దంతాల దర్గాలో శుక్రవారం గంధం ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దంతాల కుటుంబీకుల నుండి గంధం తీసుకురావడంతో ఉర్సు ఉత్సవాలను ముజవర్లు ప్రారంభించారు. అనంతరం దర్గా వద్ద జాన్‌పాడ్ తరహాలో ఉర్సు ఉత్సవాలను సంప్రదాయబద్దంగా నిర్వహించి ప్రత్యేకప్రార్థనలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు భారీగా వచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుక నరేష్. ఎంపీటీసీ బంటు నాగమ్మ, సైదులు, రమణారెడ్డి,నాగరాజు, కిషోర్ రెడ్డి. నిర్వాహకులు దంతాల వెంకన్న, రమేష్,ముజవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీ , పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మన ఊరు మన బడి, ఉపాధ్యాయుల బదిలీలు అంశంపై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి ఆదేశాలతో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా ఆన్లైన్ విధానంలో నిర్వహించాలని సూచించారు.ప్రతి జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితా, ఖాళీల జాబితా ఆన్లైన్లో ప్రదర్శించాలని వాటిలో అభ్యంతరాలను ఉపాధ్యాయుల నుంచి స్వీకరించాలని అన్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల కోసం తాత్కాలికంగా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడంలో కలెక్టర్లు కీలక పాత్ర పోషించారని, మోడల్ పాఠశాలలను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.జిల్లా కలెక్టర్ పాటిల్ హేమ త కేశవ్ మాట్లాడుతూ జిల్లాలో మనవూరు మన బడి కింద 950 పాఠశాలకు ఎంపిక కాగా అందులో మొదట విడతలో 329 పాఠశాలలలో ముందుగా 10 ప్రారంభించుటకు అలాగే 36 పాఠశాలలో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే జిల్లాలో టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ



పారదర్శనగా చేపడతామని నేరుగా ఉన్న ఖాళీలు 791 అలాగే ప్రభుత్వ , స్థానిక సంస్థలు 321, ...5, 8 సంవత్సరాలు నిండిన 1134 టీచర్లు ఉన్నారని జిల్లాలో 1925 మంది టీచర్లకు బదిలీ, పదోన్నతులు కల్పించ నున్నట్లు తెలిపారు.జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల కోసం సీనియారిటీ జాబితా,ఖాళీల జాబితా సమర్పించామని ఈ సందర్భంగా వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ, డైరెక్టర్ దేవాసేన, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కో ఆర్డినేటర్లు శ్రవణ్ కుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.